జూన్ 2017

రంజాన్ శుభాకాంక్షలతో

కొత్తపల్లి

తెలుగు పిల్లల ఈ మాసపత్రిక   వెల రూ.25/-



ఈ మాసపు అనుబంధం

చెట్లు నాటిన మనిషి

HBT, మంచిపుస్తకం వారి సౌజన్యంతో



సంపుటి: 3 సంచిక: 4 పుటలు: 68 విడి ప్రతి వెల: 25 జూన్ 2017

Editor: Narayana Sarma

Owned, Printed and Published by:
Kottapalli Prachuranalu,
1-127/A, Near MRO Office,
Chennekothapalli,
Ananthapuramu District
Andhra Pradesh-515101
Website: http://kottapalli.in
Email: team@kottapalli.in
Phone: 7702877670

Printed at:
Mudrica Offset Printers,
Sanyasi Raju street,
Gandhi Nagar,
Vijayawada,
Andhra Pradesh
Phone: 08662579129

RNI Registration No: APTEL/2014/62705
Postal Registration No: HDP/008/2015-17

స్ఫూర్తి : యు. సుబ్బరాజు

సంపాదకులు: జి.వి. నారాయణ శర్మ

ప్రచురణ:

కొత్తపల్లి ప్రచురణలు, చెన్నేకొత్తపల్లి

యాజమాన్యం:

సత్య - ఫౌండేషన్ ఫర్ ఎ హెల్దీ సొసైటీ, చెన్నూరు.

చిత్రాలు:

అడవి రాముడు : 9491870753

వీరాంజనేయులు : 7799260684

ఫైనార్ట్స్ చదువుతున్న ఇతర మిత్రులు కూడా.

వెబ్సైటు నిర్వహణ:

ఆనంద్, లక్ష్మి

వాణిజ్యం, మార్కెటింగు:

కె. మల్లికార్జున: 9000453887



విషయసూచిక



ముఖ చిత్రం: "చెట్లు నాటిన మనిషి"

92



విద్యా నామ నరస్య రూపమధికం ప్రఛ్ఛన్నగుప్తం ధనం
విద్య భోగకరీ యశ: సుఖకరీ విద్యా గురూణాం గురు:
విద్యా బంధుజనో విదేశ గమనే విద్యా పరా దేవతా
విద్యా రాజసుపూజితా- న హి ధనం- విద్యా విహీన:పశు:

సంస్కృత మూలం
(భర్తృహరి)


తెలుగు అనుసరణ
(ఏనుగు లక్ష్మణ కవి)

విద్య నిగూఢ గుప్తమగు విత్తము రూపము పూరుషాళికిన్
విద్య యశస్సు భోగకరి విద్య గురుండు విదేశ బంధుడున్
విద్య విశిష్ట దైవతము విద్యకు సాటి ధనంబు లేదిలన్
విద్య నృపాల పూజితము విద్యనెరుంగని వాడు మర్త్యుడే?!

భావం : విద్య మనిషికి అందాన్నిస్తుంది. దాచి పెట్టుకున్న ధనం లాంటిది విద్య. మనకది సుఖాన్ని, కీర్తిని కలిగిస్తుంది. గురువులకే గురువు వంటిది అది. విదేశాలలో బాంధవ్యాన్నిచ్చేది విద్యనే. అన్నిటికన్నా గొప్ప సంపద విద్య. రాజులందరి మన్ననగొనేది విద్యనే తప్ప, డబ్బు కాదు. విద్య లేనివాడు నిజంగానే వింత పశువు.

చెట్లు నాటుదాం

మనం నివసించే ఈ భూమి చుట్టుకొలత సుమారు నలభై వేల కిలోమీటర్లు. వ్యాసార్థం ఆరున్నర వేల కిలోమీటర్లు.



మన భూమి లాగానే సూర్యుడి చుట్టూ తిరిగే గ్రహాలు కనీసం ఇంకో ఎనిమిది ఉన్నాయి. వాటిలో కొన్ని భూమి కంటే చిన్నవి, కొన్ని పెద్దవి. సూర్యుడినుంచి లెక్కపెట్టుకుంటే మన భూమి మూడో గ్రహం. సూర్యుడికి అతి దగ్గరగా బుధుడు, తర్వాత శుక్రుడు ఉన్నై. భూమి తర్వాత వచ్చే నాలుగో గ్రహం అంగారకుడు చాలా చల్లగా ఉంది. బుధ గ్రహం చాలా వేడిగా ఉంటుంది (430^0C). శుక్ర గ్రహం కూడా విపరీతమైన వేడిగా (460^0C) ఉంటుంది.

వేడి అంత ఎక్కువ ఉండటం వల్ల ఆ గ్రహాలమీద "ప్రాణి" అంటూ ఏదీ ఉండే అవకాశం లేదు. ఇక చల్లబడిపోయిన అంగారక (-153°C) గ్రహంమీద జీవులంటూ ఇది వరకు ఎప్పుడో ఉండి ఉంటాయేమో గానీ ఇప్పుడైతే ఏవీ కనబడటం లేదు. సూర్యుడికి ఇంకా దూరంగాఉన్న గ్రహాలైతే ఇంకా చాలా చల్లనివి. ప్రాణులు నివసించేందుకు అనువైనవి కావు. (గురుడు -234^0C; శని -178^0C; యురేనస్ -216^0C; నెప్ట్యూన్ -200^0C; ప్లూటో -240^0C)

చూడగా సూర్యుడి చుట్టూ తిరిగే ఈ గ్రహాలన్నింటిలోకీ భూమి ఒకటే అసలు మనలాంటి ప్రాణులు నివసించేందుకు అనువుగా ఉన్నదని తెలుస్తున్నది. అంతరిక్షంలో ఇట్లా మన సూర్యుడిలాగా లెక్కలేనన్ని నక్షత్రాలున్నై. ప్రతి నక్షత్రం చుట్టూ భూమి లాగానే ఇంకా లెక్కలేనన్ని గ్రహాలు తిరుగుతున్నై. వాటిలో ఎక్కడైనా ప్రాణులు ఉండే అవకాశం నిజంగానే

లేకపోలేదు. శాస్త్రవేత్తలు ఏనాటినుండో ఆ దిశలో పరిశోధనలు సాగిస్తున్నారు.

ఇట్లా గ్రహాలు నక్షత్రాల చుట్టూ నిరంతరంగా తిరుగుతూ ఉండగా, కొన్ని ఒకదానికొకటి గుద్దుకుంటున్నాయి; నిలవలేక పడిపోయి ఆ నక్షత్రాలలోనే కలిసిపోతున్నాయి; కొన్ని వివిధ కారణాల వల్ల పేలిపోతున్నాయి; ఇంకా ఏవేవో ఘటనలు నిరంతర కాల ప్రవాహంలో భాగంగా అంతరిక్షంలో జరుగుతూనేఉన్నాయి.

ఈ క్రమంలో ప్రాణులుగా మనం గుర్తించాల్సిందేమిటి? మన భూమి బాగుంటే మనం బాగుంటాం: భూమి చల్లగాఉండాలి; ఐతే మరీ చల్లగా ఐపోకూడదు. భూమి వెచ్చగాఉండాలి; కానీ మరీ వేడిగా కాలిపోకూడదు. భూమి మీద ఇప్పుడు పారుతున్నట్లు నదులు, వాగులు, వంకలూ పారుతుండాలి; వానలు కురుస్తూ ఉండాలి; సముద్రాలు పొంగకూడదు; భూకంపాలు, తుఫానులు రాకూడదు; అణు యుద్ధాల్లాంటివి అసలు ఏమాత్రం తలెత్తకూడదు; ప్రమాదకరమైన వాయువులు, రేడియేషన్ వ్యాపించకూడదు; మనమందరం పీల్చుకునేందుకు అనువైన గాలి ఉండాలి; అది చల్లగా, హాయిగా కదలాడాలి.

వీటన్నిటికీ చెట్లతో సంబంధం ఉందని వేరేగా చెప్పనక్కర్లేదు.

అందుకని అందరం వీలైనన్ని చెట్లు నాటుదాం! ఈ వానాకాలం ఒకొక్కరం పదికి తక్కువ కాకుండా చెట్లు నాటుతామని, ఎన్ని తంటాలైనా పడి, వాటిని కాపాడుతామని ఆశిద్దాం! వందల, వేల, లక్షల సంవత్సరాల తరవాత కూడా ఈ భూమి ఇలా ప్రాణులతో సుసంపన్నంగా విలసిల్లాలని ఆశిద్దాం!

పచ్చని శుభాకాంక్షలతో,

కొత్తపల్లి బృందం



దురాశ దు:ఖానికి చేటు

పురాణ కథ

రచన: జి. మణికంఠ, 7 వ తరగతి, తేజ టాలెంట్ స్కూల్, కోదాడ, నల్గొండ జిల్లా, తెలంగాణ.

అనగనగా భస్మాసురుడు అనే రాక్షసుడొకడు, అడవిలో కఠోర తపస్సు చేస్తున్నాడు- "ఓం నమ శివాయ" అంటూ. అతని తపస్సు ఎంత తీవ్రం ఐందంటే, చివరికి అది శివుడిని చేరనే చేరింది. భస్మాసురుడి ఘోర తపస్సుకు మెచ్చిన శంకరుడు భస్మాసురుడి ముందు ప్రత్యక్షమైనాడు: "నాయనా! ఏమి కావాలో కోరుకో" అంటూ.

"శంకరా! నాకు మరణం లేకుండా వరం ఇవ్వండి" అన్నాడు భస్మాసురుడు.

అప్పుడు శివుడు నవ్వాడు- "ఒరే, నాయనా! పుట్టిన జీవి చావక తప్పదు; చచ్చిన జీవి మళ్ళీ పుట్టకా తప్పదు. అందుకని నువ్వడిగిన ఆ వరం ఇచ్చేకి వీలు కాదు. అది కాకుండా ఇంకొకటి ఏదైనా కోరుకో" అని

చెప్పాడు.

భస్మాసురుడు ఆలోచించాడు. "ఈ వరం ఇవ్వడట- దీని లాగానే ఇంకోటి ఏదైనా అడగాలి!" అనుకున్నాడు.

"సరే! నేను ఎవరి తల మీద చేయి పెడతానో వాళ్ళు తక్షణం భస్మం అయిపోవాలి!" అని అడిగాడు.

"ఇది పర్లేదు. ఈ వరం అయితే ఇవ్వచ్చు" అనుకున్నాడు శంకరుడు. "తథాస్తు" అనేసాడు.

శివుడు తథాస్తు అనగానే భస్మాసురుడు వికవికా నవ్వాడు. "ఇప్పుడు చిక్కావు నాకు!" అన్నాడు.

"ఏంటి, చిక్కటం?" అన్నాడు శివుడు.

"ఏమీ లేదు; నువ్వు అసలు శివుడివో, దొంగ శివుడివో ఎలా తేల్చుకునేది?" అని అడిగాడు భస్మాసురుడు.

"అదేం అనుమానం? నువ్వడిగిన వరం ఇచ్చేసాను. నువ్వు ఎవరి తలమీద చెయ్యి పెడితే వాళ్లు నిజంగా భస్మం అయిపోతారు" అన్నాడు శివుడు.

"అదే కనుక్కోవాలి- ముందు నీ తలమీద చెయ్యి పెడతాను. నీకు ఏమౌతుందో చూస్తాను" అని మీదికొచ్చాడు భస్మాసురుడు.



శివుడికి చాలా భయం వేసింది. "వీడెవడో మరీ ఇంత మొరటు వాడు అనుకోలేదే!" అని గబుక్కున వెనక్కి తిరిగి పరుగు పెట్టాడు.

"ఆగు! ఆగు! వరాన్ని పరీక్షించుకోనీ!" అంటూ శివుడి వెంట పడ్డాడు భస్మాసురుడు.

శివుడు ఎటు పోతే అటు వస్తున్నాడు వాడు. శివుడంతటివాడికే అలసట మొదలైంది.

అంతలో నారదుడు ఎదురయ్యాడు. "ఆగు ఆగు శంకరా!" అన్నాడు.

"ఆగేకి లేదు- వెనక భస్మాసురుడు వెంట పడుతున్నాడు. తప్పించుకునేకి ఏదైనా ఉపాయం చెప్పు- త్వరగా" అన్నాడు శివుడు, పరుగెత్తుతూనే.

నారదుడు కూడా ఆయనతోబాటు పరుగు పెడుతూ అంతా విన్నాడు.

"అయ్యో! ఎంత పనైంది! అయినా వీళ్లకు ఇట్లాంటి వరాలు ఇచ్చేదెందుకు, తర్వాత కష్టాలు కొని తెచ్చుకునేదెందుకు? అయినా అన్ని ఉపాయాలూ ఉన్న విష్ణువు ఉన్నాడుగా! ఆయన్ని తలుచుకో స్వామీ- వెంటనే ఏదో ఒక రకంగా కాపాడతాడు!" అన్నాడు నారదుడు.

అట్లా పరుగు పెడుతూనే విష్ణువుని తల్చుకున్నాడు శివుడు. సంగతి తెల్సుకున్న విష్ణువు ముందుగా తన మాయని భస్మాసురుడి మీదికి వదిలాడు. దాని ప్రభావం వల్ల వాడికి శివుడు కనిపించలేదు. ఆయన స్థానంలోనే విష్ణువు- మోహిని అనే సుందరి రూపంలో కనిపించటం మొదలు పెట్టాడు వాడికి.

తనకు శివుడిచ్చిన వరాన్నీ, తను ఆ శివుడి వెంట పడటాన్నీ అంతా మర్చిపోయాడు భస్మాసురుడు- ఇప్పుడు వాడికి కనబడుతున్నదల్లా మోహిని ఒక్కతే. ఆమె ఎంత చక్కగా ఉన్నదంటే, ఇప్పుడు వాడికి ఆమెను పెళ్ళి చేసుకోవాలని గట్టి కోరిక కలిగింది.

మెల్లిగా ఆమె దగ్గరికి వెళ్ళి- "సుందరీ! నీ పేరేంటి? నువ్వు నన్ను పెళ్ళి చేసుకుంటావా?" అని అడిగేసాడు వాడు.

మోహిని కిలకిలా నవ్వింది. ఆ నవ్వు చూసి ఇంకా మురిసిపోయాడు భస్మాసురుడు.

మోహిని అన్నది- "నువ్వు కూడా నాకు చాలా నచ్చావు. అయితే నాకో చిన్న సమస్య ఉంది- ముందు ఈ సంగతి చెప్పు- నీకు నాట్యం చేయటం వచ్చా?" అని.

"ఓ! చాలా బాగా వచ్చు" అన్నాడు

భస్మాసురుడు.



"అయితే ఇక పెళ్ళి అయినట్లే! నువ్వు నేను చేసినట్లు నాట్యం చెయ్యి- నాకంటే బాగా చెయ్యాలి మరి! నాట్యంలో నన్ను ఓడించిన వాడినే నేను పెళ్ళి చేసుకుంటాను అని నా జాతకంలో ఉందట" వంకరగా చెప్పింది మోహిని.

"ఓస్! దానిదేముంది. మొదలుపెట్టు నాట్యం!" అన్నాడు భస్మాసురుడు.

మోహిని నాట్యం మొదలెట్టింది. ఆమె ఎట్లా ఆడితే అట్లా ఆడసాగాడు భస్మాసురుడు. క్రమంగా నాట్యం వేగం పుంజుకున్నది. మోహిని తన తలమీద చెయ్యి పెట్టుకొని నాట్యం చేసింది. "ఈ నాట్యం బలే ఉందే" అనుకున్నాడు భస్మాసురుడు. ఆ మొరటు వాడికి తన వరం సంగతి గుర్తే లేదు- ఆమె మాదిరే తనూ తన తలమీద చెయ్యి పెట్టుకున్నాడు- మరుక్షణంలో వాడు కాస్తా భస్మం అయిపోయాడు!

లోకానికి భస్మాసురుడి పీడ విరగడైంది. తనను, లోకాన్ని కాపాడిన విష్ణువుకు ధన్యవాదాలు చెప్పుకున్నాడు శివుడు. "పాత్రత లేని వాళ్ళకు ఇట్లాంటి వరాలు దొరికితే ఎలాగ?" అని నవ్వాడు విష్ణువు.

రవి: నాన్నా మా స్కూల్ లో ఎవరూ చేయలేని పనిని నేను చేసాను తెలుసా! చివరికి మా టీచర్ కూడా చేయలేదు.

నాన్న: ఆహా! ఎలాగ? ఆ పని ఏంటో చెప్పు మరి!

రవి: నా చేతిరాతను చదవడం నాన్నా!





వినబడని అల్లుడి కథ

రచన: నాగ తరుణ్, 6 వ తరగతి, వికాస విద్యావనం, పోరంకి, కృష్ణాజిల్లా.

అనగనగా ఒక ఊర్లో ఒక చెవిటివాడు ఉండేవాడు. అతని పేరు రాము. రాము భార్య పేరు విమల.

విమల ఒక రోజు తన భర్త చెవిలో గట్టిగా అరిచింది- "ఏమండీ మా నాన్న వస్తానంటున్నాడు మనింటికి" అని.

"ఎందుకే, నాకు చెవుడు కదా!" అన్నాడు రాము.

విమల విసుక్కున్నది- "అయినా ఎవరైనా మనింటికి వస్తామంటే ఎప్పుడూ రావద్దనటం ఏం బాగుంటుంది?" అని. తర్వాత భర్తకు చెప్పాల్సిన జాగ్రత్తలన్నీ గట్టిగా చెప్పి, "చెవిటి వాడు అనే అనుమానం రాకుండా నడుచుకోండి. ఇంకొంచెం సేపట్లో మా నాన్న వచ్చేస్తాడు" అని అరిచింది.

"సరేలే, ఇక తప్పదు" అనుకొని కూరగాయలు తెచ్చేందుకు సంతకు వెళ్ళాడు రాము.

అతను వెనక్కి తిరిగి వచ్చేసరికి వాళ్ళ మామ ఎదురయ్యాడు. "బాగున్నవా, మామయ్యా?!" అన్నాడు రాము చాలా మర్యాదగా.

"బాగున్నాను బాగున్నాను" అన్నాడు మామ.

"మీరంతా ఎట్లా ఉన్నారు?" అని అడుగుతాడనుకున్నాడు రాము. కానీ వాళ్ల మామ అట్లా ఏమీ అడగలేదు. అయినా ఆ సంగతి రాముకు తెలీదు కదా, అందుకని "మేం కూడా చాలా బాగున్నాం" అని చెప్పేసి, తర్వాతి ప్రశ్న వేసేసాడు: "నీ ఆరోగ్యం బాగుందా మామా, ఇప్పుడు ఏం మందులు వాడుతున్నావు?" అని.

"ఆరోగ్యం ఇప్పుడు చాలా బాగుంది. మందులేమీ వాడట్లేదు ఇప్పుడు" చెప్పాడు మామ.

"ఏదో ఒక మందు పేరు చెబుతాడు" అనుకున్న రాము తనకు ఏమీ వినిపించకపోయినా "బాగుంది బాగుంది. మంచి మందే!" అన్నాడు. వాళ్ళ మామ అతనికేసి అదోలా చూసాడు.

అంతలో "ఇంతకీ మీరు వెళ్తున్నది ఏ డాక్టరు దగ్గరికి?" అని అడిగేసాడు రాము. వాళ్ళ మామ "ఇప్పుడు ఎవ్వరి దగ్గరికీ వెళ్ళట్లేదు అల్లుడూ!" అన్నాడు.

"ఎవరో వైద్యుడి పేరు చెప్పి ఉంటాడు" అనుకున్న రాము, తనకు ఏమీ వినపించకపోయినా "ఆఁ ఆఁ అవును. మంచి వైద్యుడే!" అనేసాడు.



అంతలో విమల కాఫీ పట్టుకొచ్చింది. "నాకు కొంచెం చక్కెర ఎక్కువ వేయమ్మా" అన్నాడు మామ.

అయితే రాము చటుక్కున లేచి, విమల చేతిలోంచి కాఫీ కప్పుని లాక్కొని

వంటగదిలోకి పరుగు పెట్టాడు. సంగతి అర్థం కాని విమల వాళ్ళ నాన్న కేసి చూసి ఓ నవ్వు నవ్వింది "ఈయనకి అతిధులంటే చాలా ఇష్టం" అని చెబుతూ.

వంటగదిలోకి పరుగుపెట్టిన రాము ఆ కాఫీలోకి నాలుగు చెంచాల ఫినాయిల్ కలిపాడు. "కాఫీలోకి నేను ఫినాయిల్ కలుపుకుంటాను" అన్నాడనుకున్నాడు మరి!

అతను తెచ్చిచ్చిన కాఫీ తాగి మామ "ఏంటి, కాఫీ ఇట్లా ఉంది?" అన్నాడు.

ఆ ముక్క వినబడింది రాముకు. "నువ్వే కదా మామా! ఫినాయిల్ ఎక్కువ వేయమన్నది?!" అనేసాడు. ఆ దెబ్బకు అర్థమైపోయింది మామకు- తన అల్లుడికి వినపడదు అని!

తండ్రికి కూడా తెలీకుండా గుట్టుగా సంసారాన్ని ఈడ్చాలనుకున్న విమల వెర్రిమొహం వేసింది.

***

అలా కొన్ని రోజులు గడిచాయి. వాళ్ళకి ఒకేసారి ముగ్గురు పిల్లలు పుట్టారు. "పిల్లలకు ఎవరైనా దేవుళ్ళ పేరు పెట్టు" అన్నారు రామువైపు వాళ్ళు. "మా పెద్దవాళ్ల పేర్లు పెట్టు" అన్నారు విమల వైపు వాళ్ళు. దాంతో రాముకి కోపం వచ్చింది. "నా పిల్లలు- నా ఇష్టం" అని, కొడుక్కి "విరిగిపోయిన" అని వింత పేరు ఒకటి పెట్టాడు. పెద్ద కూతురికి "చినిగిపోయిన" అని పెట్టాడు. మూడవ బిడ్డకు "పాడైపోయిన" అని పేరు పెట్టాడు.



ఒకసారి రాము బంధువులు కొందరికి పట్నంలో ఏదో పని పడింది. వాళ్లకు రాము అంటే ప్రత్యేకంగా ఇష్టం ఏమీ లేదు. నిజానికి వాళ్ల మనసుల్లో అంతా కల్మషమే నిండి

ఉన్నది. అయినా, "వాళ్ళింటికి వెళ్తే ఖర్చులు తగ్గించుకోవచ్చు!" అని వాళ్ళింటికి దిగబడ్డారు ఓ సాయంత్రం.

వాళ్లని చూడగానే విమల చాలా ఉత్సాహపడింది. "రాక రాక వచ్చారు, బంధువులు!" అని వాళ్ల కేసి నవ్వుతూ చూస్తూ, లోపలికి తిరిగి గట్టిగా అరిచింది: "పాడైపోయినా, కుర్చీ తీసుకురారా! విరిగిపోయినా పాలు యివ్వవే! చినిగిపోయినా టవలు యివ్వవే!" అని.

దాంతో ఆ వచ్చిన బంధువులంతా "వామ్మో! వీళ్ళకి మన సంగతి తెలిసిపోయింది" అని గబగబా పారిపోయారు!

పొడుపు కథలు

* తోట నలుపు, తింటే పులుపు?

* కుడితి తాగదు, మేత మేయదు కానీ కడివెడు పాలు ఇస్తుంది.?

* సన్నని స్తంభం ఎవరూ ఎక్కలేరు , ఎవరూ దిగలేరు?

* పూజకు పనికిరాని పువ్వు, ఆడవారు మెచ్చే పువ్వు. ఏంటది?

* ఆకు చిటికెడు, కాయ మూరెడు.

* ఆ ఇంటికీ, ఈ ఇంటికీ మధ్య దూరం?

* ఆకులు లేని అడవిలో జీవం లేని జంతువు, జీవం ఉన్న జంతువులను వేటాడుతుంది.

* ప్రతీ ఇంటిలో ఒక నల్లోడు?

* ఆకాశంలో అరవై గదులు, గదిగదికీ ఒక సిపాయి, సిపాయికి ఒక తుపాకి.

* ఇక్కడ ఉంటుంది, అక్కడ ఉంటుందిపిలిస్తే పలుకుతుంది, మనలాగా మాట్లాడుతుంది.

* ఊరంతటికీ ఒకటే దుప్పటి

* అందరాని వస్త్రంపై అందని వడియాలు?

* చూస్తే చూపులు, నవ్వితే నవ్వులు. ఏంటది?

*తెలిసేటట్లు పూస్తుంది, తెలియకుండా కాస్తుంది.

(సమాధానాలు వేరే పేజీలో!)



మిత్రుల సాహసం

రచన: యస్.శ్రీకాంత్, 9 వ తరగతి, తేజ విద్యాలయ, కోదాడ, నల్గొండ జిల్లా, తెలంగాణ.

తేజ విద్యాలయంలో తొమ్మిదో తరగతి చదివే శ్రీకాంత్, సాయి కుమార్ ఇద్దరూ ప్రాణ మిత్రులు. ఇద్దరూ కలిసి తిరిగేవాళ్ళు, కలిసి ఆడేవాళ్ళు, ఏ పని చేసినా కలిసిచేసేవాళ్ళు. బడిలో ఎవరికి ఏం కావాలన్నా వీళ్లిద్దరూ ముందుకొచ్చి సహాయం చేసేవాళ్ళు.

శ్రీకాంత్ వాళ్ల నాయనమ్మ అక్కడికి దగ్గర్లోనే బక్కమంతుల గూడెంలో ఉంటుంది. ప్రతి సంవత్సరమూ వేసవి సెలవల్లో మనవళ్ళూ మనవరాళ్ళందరితో ఆ ఊరు ఊరంతా కళకళలాడేది. పిల్లలంతా ఆ ఊరి ముచ్చట్లే చెప్పుకుంటూ గడిపేవాళ్ళు సంవత్సరమంతా "ఈసారి సెలవల్లో నువ్వూ వస్తావా, మా నాయనమ్మ వాళ్ల ఊరు బలే ఉంటుంది!"

అని ఊరించాడు శ్రీకాంత్. సాయికుమార్ వాళ్ళ ఇంట్లో వాళ్లనడిగితే వాళ్ళు "సరే మరి- కానీ జాగ్రత్తగా ఉండాలి. ఊరికే ఎవ్వరితోటీ గొడవలు పెట్టుకోకూడదు" అంటూనే అనుమతి ఇచ్చేసారు.

సెలవలు ఇవ్వగానే మిత్రులు ఇద్దరూ బస్సెక్కి పల్లెటూరులో దిగారు. బస్సు వాళ్లని దింపి ముందుకు వెళ్ళిపోయింది. అంతకు ముందు ఎన్నడూ పల్లెటూరును చూసి ఉండని సాయికుమార్‌కి అంతా కొత్తగా ఉంది. ఆ సరికి వాళ్లని తీసుకెళ్ళేందుకు ఎద్దులబండి ఒకటి వచ్చి ఉన్నది. ఎద్దులబండి ఎక్కటం, గతుకులు వచ్చినప్పుడల్లా ధబాలున నడుములు విరిగేట్లు పడటం, ఇద్దరూ నవ్వుకోవటం- అట్లా మొదలైంది సాయికుమార్ పల్లె అనుభవం.

కొద్దిరోజులకు పల్లెటూరు అలవాటైంది. వేసవి కాలం కదా, రోజూ శ్రీకాంత్ , సాయి కుమార్ మిగతా స్నేహితులు అంతా వాళ్ళ ఇంటి దగ్గరే ఉన్న బావిలో ఈత కొట్టేవాళ్ళు. ఇద్దరూ కూర్చొని రోజూ అర్థగంట సేపు దినపత్రిక తిరగేసేవాళ్ళు. మధ్యాహ్నం అయ్యిందంటే చల్లటి నీళ్ల మజ్జిగ త్రాగేవాళ్ళు. ఇంట్లోనే రకరకాల ఆటలు ఆడేవాళ్ళు. సాయంత్రం అందరూ గట్లమీద చేరి ముచ్చట్లు పెట్టుకునేవాళ్ళు.

ఒకరోజు సాయంత్రం వాళ్ళని ఆలోచింపజేసే సంగతి ఒకటి తెల్సింది: బక్కమంతుల గూడేనికి దగ్గర్లోనే మట్టపల్లి శ్రీ లక్ష్మి నరసింహ స్వామి క్షేత్రం ఒకటి ఉన్నది. ప్రతి సంవత్సరమూ ఎండాకాలంలో అక్కడ విపరీతమైన రద్దీ ఉంటుంది. అయితే ఎందుకనో, గత రెండేళ్ళుగా ఆ ఊరికి భక్తుల రాకపోకలు గణనీయంగా తగ్గిపోయాయి. అంతకు ముందు అక్కడ 'నిద్రలు' చేసే వాళ్ళు కూడా, ఇప్పుడు సాయంత్రం అయ్యేసరికి వెళ్ళిపోతున్నారు.

"ఎందుకు వచ్చింది, ఈ మార్పు?" అడిగాడు సాయికుమార్.

వాళ్ళకు ఈ సంగతి చెప్పిన స్నేహితుడు రాజేష్ సిగ్గు పడుతున్నట్లు నవ్వాడు: "ఏమీ

లేదు; ప్రతి రోజూ రాత్రి అవ్వగానే గుడినుండి భయం గొలిపే వింత వింత శబ్దాలు వస్తున్నాయి. గుడికి వచ్చిన వాళ్లందరికీ గుండెలు అదిరేలా చప్పుళ్ళు, ఎవరో ఏడుస్తున్నట్లు శబ్దాలు.. దాంతో గుడికి రాకపోకలు బాగా తగ్గాయి" అని చెప్పాడు.



"ఎందుకొస్తున్నాయి, శబ్దాలు?" అడిగాడు సాయి కుమార్.

"ఏమో మరి. దయ్యాలు అని అందరూ అంటున్నారు" చెప్పాడు రాజేష్.

" 'దయ్యాలు, భూతాలు అంటూ వేరే ఏవీ ఉండవు. అన్నీ మనుషులే' అని మన సైన్సు సార్ ఎప్పుడూ చెబుతూనే ఉంటారు కదా, లేని దయ్యాలు ఉన్న చప్పుళ్ళెలా చేస్తాయి?" అడిగాడు సాయికుమార్ ఆసక్తిగా.

శ్రీకాంత్ గట్టిగా నవ్వి వేరే సంగతేదో మాట్లాడాడు.

మరుసటి రోజున మిత్రులిద్దరూ మట్టపల్లికి బయలుదేరారు. "రాత్రిలోగా తిరిగి వచ్చేస్తాం; ఒకవేళ ఆలస్యం అయితే మట్టపల్లి గుడిలో కాకుండా, ఊళ్ళోనే సుబ్బమ్మ అత్త దగ్గర ఆగి, రేపు తెల్లవారి వస్తాం" అని ఇంట్లో చెప్పారు: "లేకపోతే మా ఇంట్లోవాళ్ళు కూడా పోనివ్వరు" నవ్వాడు శ్రీకాంత్.

"మరి నేను చెప్పినట్లు మీ అమ్మ సెల్‌ఫోను దగ్గర పెట్టుకున్నావుగా? అది బాగా అవసరం కావొచ్చు!" అడిగాడు సాయికుమార్.

"ఓఁ అదే మనకు టార్చ్ లైటుగాను, కెమెరాగా కూడాను పని చేస్తుంది ఇవాళ్ళ"

అని జేబులోని సెల్‌ఫోను చూపించాడు శ్రీకాంత్.

ఇద్దరూ మట్టపల్లి చేరుకొని గుడి అంతా కలయ తిరిగారు. గుడికి చాలా ఎత్తైన ప్రహరీ గోడ ఒకటి ఉన్నది. ఊళ్ళో ఉన్నవాళ్లకు ఆ గోడ వెనక ఏమౌతున్నదో అస్సలు ఏమాత్రం కనిపించదు. అద్భుతమైన శిల్పకళతో విలసిల్లుతున్న ఆ గుడిని శ్రీకృష్ణదేవరాయలవారు కట్టించారు అని చెబుతారు. పిల్లలిద్దరూ దైవ దర్శనం చేసుకున్నారు. మెల్లగా సాయంత్రం అయ్యింది. ఇంక చీకటి పడుతుందనగానే అక్కడ చేరినవాళ్ళు, పూజారులు అందరూ గబగబా గుడికి తాళాలు వేసుకొని వెళ్ళిపోయారు. మిత్రులిద్దరూ అక్కడే కల్యాణమండపంలో ఓ స్తంభం మాటున దాక్కుని ఉండిపోయారు. మెల్లగా చీకటి అలుముకున్నది. చీకట్లతో పాటే "ధబ ధబ.. గుడ.. గుడ.. ఠాప్!" అంటూ పెద్ద పెద్ద శబ్దాలు కూడా మొదలయ్యాయి గుడి వెనకవైపునుండి.

"మెల్లగా అటువైపుకు నడు.. శబ్దం చేయకు అస్సలు..టార్చ్ వాడకు.." గుస గుసగా చెప్పాడు సాయికుమార్.

ఇద్దరూ మెల్లగా గుడి వెనక భాగానికి చేరారు:

అక్కడ అన్నీ రకరకాల వైర్లు పరిచి ఉన్నాయి. బాగా వెలుతురునిచ్చే ఫోకస్ లైట్లు, రకరకాల పరికరాలు, గనుల్లో ఉపయోగించే వాహనాలు వచ్చి చేరుకొని ఉన్నాయి. ఇంకొద్ది దూరంలోనే తెల్ల బట్టలు వేసుకొని, పెద్ద పెద్ద మీసాలు పెట్టుకొని ఉన్న రాజకీయ నాయకులు కొందరు కులాసాగా కబుర్లు చెప్పుకుంటూ కనబడ్డారు. చప్పుడు చేయకుండా, ఎవ్వరికీ ఎలాంటి అనుమానమూ రాకుండా వాళ్లందరినీ తమ దగ్గరున్న సెల్‌ఫోనుతో ఫొటోలు, వీడియోలు తీసాక, అక్కడినుండి బయటపడ్డారు శ్రీకాంత్, సాయికుమార్.

"అర్థమైందా? దయ్యాలు ఏం చేస్తున్నాయో? గుడినంతా గుప్తనిధుల కోసం త్రవ్వేసారేస్తున్నాయి.



వాటికి అడ్డం అని, గుడిలోకి భక్తులెవ్వరూ రాకుండా శబ్దాలు చేసి, పుకార్లు పుట్టిస్తున్నాయి!" అన్నాడు సాయికుమార్.

"ఇప్పుడు మనుషులే వాటికి బుద్ధి చెప్పాలి. మనం పోలీసుల్ని పిలుద్దామా, ఇళ్ళలో జనాలని పిలుద్దామా?" అడిగాడు శ్రీకాంత్.

"వీళ్ళెవరో బాగా పెద్ద మనుషుల్లా ఉన్నారు. పోలీసుల్ని పిలిస్తేనే మంచిది" అని, పిల్లలిద్దరూ తమ దగ్గరున్న సమా-చారాన్నంతా పోలీసులకు అందజేసారు. చకచకా చర్యలు తీసుకున్న పోలీసులకు దొంగలందరూ అడ్డంగా దొరికిపోయారు!

ప్రభుత్వానికి చెందాల్సిన నిధులకోసం ప్రజల్ని భయాందోళనలకు గురిచేసినందుకు దొంగలందరికీ శిక్షలు పడ్డాయి. శ్రీకాంత్, సాయికుమార్‌లు ఇద్దరినీ ప్రభుత్వం చాలా అభినందించింది.

భర్త: మన అమ్మాయికి మంచి అందగాడినీ, తెలివిగలవాడినీ, ఆస్తిపరుడినీ వరుడిగా తేవాలనుకుంటున్నాను.

భార్య: ఇది మాత్రం చాలా చక్కగా చెప్పారండీ. మా నాన్నలా మనం తొందరపడకూడదు.

భర్త: ఆc!!



పరోపకారం

రచన-యం.అనూష.జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల, రాచర్ల బొప్పాపూర్, రాజన్న సిరిసిల్లా జిల్లా, తెలంగాణ

దేవేంద్రపురంలో రిచా, భరత్ అనే దంపతులు నివసిస్తుండేవారు. భరత్ ప్రభుత్వ ఉద్యోగి. రీచా చదువుకున్నది, కానీ ఇంట్లోనే ఉండేది.

"ఆమె కూడా ఏదైనా ఉద్యోగం చేస్తే బాగుండును" అనుకునేవాడు భరత్. "ఇతనికి ఇంకా ఎక్కువ డబ్బులు వచ్చే ఉద్యోగం వస్తే బాగుండును" అనుకునేది రిచా.

ఒకసారి వాళ్ళిద్దరూ సినిమాకి వెళ్దామనుకున్నారు. "సాయంత్రం ఆఫీసు నుండి త్వరగా వచ్చేయి" అని చెప్పింది రిచా. "సరే" అని ఆఫీసుకెళ్ళాడు భరత్.

అన్నట్లుగానే సాయంత్రం ఆఫీసరునడిగి ఒక గంట ముందుగా బయలుదేరాడు ఇంటికి. అయితే దారిలో అతనికి ఎదురుగా వస్తున్న

స్కూటర్ ఒకటి అదుపు తప్పింది. వంకరలు తిరుగుతూ పోయి ఓ చెట్టుకు గుద్దుకున్నది. దాన్ని నడుపుతూన్న మధ్యవయసు వ్యక్తి స్పృహ తప్పి నేలమీద పడిపోయాడు!



భరత్ వెంటనే అతని దగ్గరకు వెళ్ళి చూసి, అంబులెన్సుకు ఫోను చేసాడు. అది రాగానే తను కూడా వాళ్ళతో బాటు ఆసుపత్రికి వెళ్ళాడు; డాక్టర్లతోటీ, పోలీసులతోటీ మాట్లాడాడు; తనకు చేతనైనంత సాయం చేసాడు; రాత్రి బాగా చీకటి పడ్డాక ఇల్లు చేరుకున్నాడు.

ఇంటికి వచ్చేసరికి ఇంట్లో రిచా అలిగి కూర్చొని ఉన్నది. "సినిమా కోసం త్వరగా వస్తానన్నావు- ఎందుకు రాలేదు?!" అని పోట్లాట పెట్టుకున్నది. జరిగినదంతా చెప్పేందుకు ప్రయత్నించాడు భరత్. కానీ ఆమె వినలేదు- "నీకు నాకంటే ఊళ్ళోవాళ్ళే ఎక్కువయ్యారు!" అని ఏడ్చింది. భరత్ "అయ్యో! దేవుడా!" అని తలపట్టుకున్నాడు.

గొడవ చిలికి చిలికి గాలివాన అయ్యింది. రిచా రాత్రికి రాత్రి "నేను మా పుట్టినింటికి వెళ్ళిపోతాను. నేనంటే ఇష్టంలేని దగ్గర నేనెందుకుంటాను" అంటూ బట్టలు సర్దుకోవటం మొదలుపెట్టింది. భరత్ ఆమెను ఆపేందుకు కొంచెం ప్రయత్నించాడుగానీ, కొద్ది సేపటికి అతనూ సహనం కోల్పోయాడు- "పో! నువ్వెటు పోతావో నేనూ చూస్తాను!" అని అరిచాడు. దాంతో రిచాకు కోపం ఇంకా పెరిగిపోయింది."నీతో నాకు పనే లేదు. నేను

ఇంకెప్పటికీ రానే రాను" అని ఆవేశంగా అరిచి, ఇల్లువిడిచి బయలుదేరింది. బస్టాండుకు పోతూ పోతూ దారిలోంచే తన తల్లిదండ్రులకి ఫోను చేసింది. "నువ్వు ఇక్కడికి వచ్చి చాలా రోజులైందిగా, ముందు బయలుదేరి వచ్చేయి తల్లీ, గొడవ సంగతి మళ్ళీ చూద్దాం" అన్నారు వాళ్ళు.



ఫోనులోకి మాట్లాడుతూ పరాకుగా ఉన్న రిచా తన వెనకే వస్తున్న బస్సును గమనించలేదు. బస్సు డ్రైవరు కొట్టిన హారన్ ఆమెకు వినిపించలేదు. బస్సు వచ్చి తగిలేసరికి ఆమె క్రింద పడిపోయింది. చుట్టూ ఉన్నవాళ్ళు ఆమెను దగ్గర్లోని ఆసుపత్రికి తరలించారు. రిచాకు తెలివి వచ్చాక, భరత్‌కు ఫోను చేసింది. తనను ఆస్పత్రిలో చేర్చినవాళ్లందరికీ ధన్యవాదాలు చెప్పింది. హడావిడిగా వచ్చాడు భరత్. ఫోను చేసి రిచా తల్లిదండ్రులతో మాట్లాడాడు. తెల్లవారేసరికి వాళ్ళు కూడా అక్కడికి చేరుకున్నారు.

"నన్ను క్షమించండి. సినిమా తప్పిపోయిందన్న కోపంతో ఏమేమో అన్నాను. ప్రాణాల్ని కాపాడటన్ని మించిన ధర్మం ఏదీ లేదని అర్థమైంది నాకిప్పుడు" అన్నది రిచా, తన ప్రవర్తనకు సిగ్గు పడుతూ.

"చూసావు కదా రిచా, మనం ఒకరికి సహాయం చేస్తే మనకు ఇంకొకరు సాయం చేస్తారు. సాయం చేసేటప్పుడు వేరే ఏదీ ఆలోచించలేము- అట్లా ఆలోచిస్తే సాయమూ చెయ్యలేము!" అన్నాడు భరత్.

"అసలు ఈ సినిమాల పిచ్చిని అనాలి- ఇదంతా జరిగింది ఆ సినిమా పిచ్చి వల్లనే!" అన్నారు రిచా నాన్నగారు తన మామూలు ధోరణిలో. ★



పెళ్ళి విందు

"మన సమాజంలో ఒక భాగం ఇంత నికృష్టంగా ఉందే, మరి మనం అభివృద్ధి అనగానే సాంకేతికత గురించీ, రోడ్లు, సెల్‌ఫోనులు, కార్లు, విమానాలు, కంప్యూటర్ల గురించే మాట్లాడుతామెందుకు?"- అంటే ఎవరం ఏం చెబుతాం? *మార్పు చేర్పులు: కొత్తపల్లి*

రచన: టి. ఇశాక్, 9 వ తరగతి , జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, రాయల చెరువు, అనంతపురం జిల్లా.

నంద్యాల నుంచి మాకు పెళ్ళిపిలుపు వచ్చింది. బాగా దగ్గరివాళ్ళింట్లో పెళ్ళి. నేను, మా అమ్మ, చెల్లి- ముగ్గురమూ వెళ్ళాలి పెళ్ళికి. మా అమ్మ ముందుగానే బయలుదేరిపోయింది- నేనూ, చెల్లీ వెనకగా బయలుదేరాం నంద్యాలకి.

తీరా చేరుకున్నాక తెలిసింది మా తలతిక్క పనేంటో: పెళ్లి జరుగుతున్నది నంద్యాలలో

కాదు- నందికొట్కూరులో! మా హడావిడిలో మేం పెళ్ళిపత్రికని చూసుకోనే లేదు!



"అసలే ప్రొద్దుట్నుంచీ ప్రయాణం చేసీ చేసీ కడుపు కాలుతుంటే, మళ్ళీ ప్రయాణం చేయాలా!" అని విసుక్కుంటూ బస్టాండుకెళ్ళాం. మేం ఇంకా అడుగు పెట్టకనే నందికొట్కూరు బస్సు- వెళ్ళిపోయింది! ఇంకో రెండు గంటల పాటు ఎదురుచూసి, చివరికి వేరే బస్సెక్కాం. చింపిరి ముఖాలు వేసుకొని నందికొట్కూరు చేరుకున్నాం.

ఆ సరికి పెళ్ళి సమయం దాటిపోయింది. అయినా "వీడి తిక్కగానీ, ఈ పెళ్ళేదో వీడు నంద్యాలలోనే చేసుకొని ఉంటే మాకింత శ్రమ, ఇన్నేసి చార్జీలు- ఇవన్నీ తప్పేవి కదా!" అని తిట్టుకుంటూ వరుడ్ని కలిశాం.

అబ్బో ఆ దుస్తులూ, మేకప్పూ భలే చేశాడు. సెంటు కొట్టాడండీ బాబూ- ఏదో ఫారెన్ సెంటట- వాసనకు మా చెల్లి అయితే తల తిరిగి పడిపోయింది. అంత మంచి వాసన. ఎక్కడాలేనన్ని పూలు, లైట్లు, వీడియోలు పెట్టాడు. పలకరించేదంతా కొద్ది నిమిషాల్లో ఐపోయింది. పెళ్ళికి ఎవరెవరో వచ్చారు. అందరికీ హలో చెప్పేసి, "ఆకలి! ఆకలి! వివాహ భోజనంబు!" అనుకుంటూ భోజనశాలకు పరుగు పెట్టాము.

అబ్బబ్బ ఆ వంటలూ ఆ సువాసనా, ఏం చెప్పాలి?! ఆ మాంసాలూ, వేపుడు వంటలు, ఆ బిర్యానీ, పెరుగు పచ్చడీ, మిఠాయిలూ.. ఒక్కటీ విడువకుండా మొత్తం లాగించేసాను. "ఇంక కడుపులో చోటు లేదు" అనుకున్నాను. ఇప్పుడు నా పొట్ట నిండు కుండ. అయినా ఇంకేదో వెలితి- "కూల్ డ్రింక్ కావాలి"!

కూల్‌డ్రింక్ చేతిలో పట్టుకొని నడుస్తూ ఆ

"గార్డెన్" వెనకవైపుకెళ్ళాను. అక్కడ పిల్లలు ఎవరో కొట్లాడుతున్నట్లున్నారు- ఏంటా అని అటువైపుకెళ్ళా- వాంతికొచ్చినట్లయింది. అక్కడ ఓ పదిమంది పిల్లలు- మేం తిని పారేసిన అన్నాన్నీ, చీకి పడేసిన ఎముకల్నీ ఏరుకుని తింటున్నారు. వాటికోసం కొట్లాడుకుంటున్నారు. వాళ్ళు తింటున్న ఆ ఆహారాన్నీ, వాళ్ళున్న ఆ ప్రదేశాన్నీ చూస్తే నా ఒళ్ళు జలదరించింది. వాళ్ల చుట్టూతా పందులు,కుక్కలు- అన్నీ అక్కడికి విసిరి పడేస్తున్న విస్తర్ల కోసం వాళ్లతో బాటు ఎగబడుతున్నాయి. ఆ పిల్లలకు పోటీగా దొరికిన దాన్ని దొరికినట్లు ఆబగా తింటున్నాయి.

నేను నిశ్చేష్టుడినైపోయి అటూ ఇటూ చూసాను. రోడ్డు మీద అంతా బస్సులూ, లారీలూ, ఆటోలూ.. వాటిలో నిండా ప్రయాణీకులు.. వీళ్ళెవ్వరికీ కనిపించట్లేదా, ఈ పిల్లలు?! వీళ్ళంతా నాకొక్కడికే కనిపించేట్లు మాయ చేసాడా దేవుడు?

లేదు.. వీళ్ళు అందరికీ కనిపిస్తూనే ఉన్నారు. కొందరు అప్పుడప్పుడూ వచ్చి వీళ్ళను అక్కడినుండి తరుముతున్నారు. తరిమిన వాళ్ళు అటు తిరగగానే వీళ్ళు మళ్ళీ వస్తున్నారు- వచ్చి, విస్తర్ల చుట్టూ కమ్ముకుంటున్నారు. ఇంతలో పడమటి వైపునుండి ఘాటుగా గాలి వీచింది. విచిత్రమైన కంపునొకదాన్ని మోసుకొచ్చింది. నేను భరించలేక వాంతి చేసేసుకున్నాను.

అక్కడున్న పిల్లలు నాకేసి ఓసారి చూసారు. చూసి, మళ్ళీ విస్తర్ల మీదికి ఎగబడ్డారు.

మన సమాజంలో ఒక భాగం ఇంత నికృష్టంగా ఉందే, మరి మనం అభివృద్ధి అనగానే సాంకేతికత గురించీ, రోడ్లు, సెల్‌ఫోనులు, కార్లు, విమానాలు, కంప్యూటర్ల గురించే మాట్లాడతా- మెందుకు? వీళ్ళని ఎవరమూ ఎందుకు, పట్టించుకోము? ★



తెలివైన పిల్లలు

రచన: జి.సందీప్, 8 వతరగతి, తేజటాలెంట్ స్కూలు, కోదాడ, నల్గొండ జిల్లా, తెలంగాణ.

మాలిపురంలో ప్రవీణ్, మహేష్ అనే ఇద్దరు స్నేహితులు కలిసి మెలిసి ఉండేవాళ్ళు. వాళ్ళ తెలివి తేటల్ని గురించి ఊళ్ళోవాళ్లంతా గొప్పగా చెప్పుకునే వాళ్ళు.

ఒకసారి ఆ ఊరి రాజుగారి భవనంలో దొంగతనం జరిగింది. రాణిగారు ఎంతో మక్కువగా పెట్టుకునే ఆభరణాల మూటని ఎవరో సునాయాసంగా దొంగిలించారు!

రాజుగారు చాటింపు వేయించారు: ఈ ఆరణాల దొంగల్ని పట్టించిన వాళ్లకు వంద బంగారు నాణాలు బహుమతిగా ఇస్తానని.

ఊళ్ళో వాళ్ళంతా మహేష్, ప్రవీణ్‌లతో "ఒరే, మీరు ఇంత తెలివైనవాళ్ళు, ఆ దొంగలెవరో కనుక్కోండి గదా" అన్నారు.

ప్రవీణ్ కొంచెం ఆలోచించి, "ఈ పని చేసేవాళ్ళకు రాజుగారి భవనం గురించి,

రాణిగారి నగల మూట గురించీ బాగా తెలిసి ఉండాలి. అంటే రాణిగారి దగ్గర పనిచేసే వాళ్ళే ఎవరో ఈ పని చేసారన్నమాట" అన్నాడు.

"రాణిగారి చెలికత్తెల్ని అందరినీ ఒక్కరొక్కరుగా పిలిపించి అడిగితే సరి!" అన్నాడు మహేష్.

"రాణిగారి నగల్ని వాళ్లెవరో ఇంత త్వరగా అమ్ముకోలేరు. అందుకని ఆ మూటకి మూట ఎక్కడో భద్రంగా ఉండే ఉంటుంది ఇంకా" అన్నాడు ప్రవీణ్.

"దొంగలు రాణివాసంలో వాళ్ళే. కనుక నగల మూట కూడా ఇంకా రాణివాసంలోనే ఉంటుంది. బయటికి చేరుకొని ఉండదు" అన్నాడు మహేష్.

ఇద్దరూ కలిసి రాజుగారి దగ్గరకెళ్ళి, "మేం మీ నగల మూట ఎక్కడుందో కనుక్కుంటాం. మాకు ఓ రెండు మూడు రోజులు రాణివాసంలో ఉండేందుకు అనుమతి-నివ్వండి. అట్లాగే పొగ చుట్టలు కూడా ఓ పదో ఇరవయ్యో తెప్పించండి" అన్నారు.

రాజుగారు సరేనన్నారు.

"ఎవరో ఇద్దరు పిల్లలు రాణిగారి ఆభరణాల దొంగల్ని పట్టుకునేందుకు వచ్చారట" అని ఊరంతా తెలిసిపోయింది.

ఆరోజు రాత్రి రాణివాసంలో కల్లోలం రేగింది. "మంట! మంట!" అని అరుపులు రేగాయి. రాణివాసం అంతటా పొగ క్రమ్ముకున్నది. రాజుగారు పరుగున వచ్చారు రాణివాసానికి-"ఏం జరిగింది, ఏమైంది? ఎవరికీ ఏమీ జరగలేదు గద?!" అంటూ.

మహేష్, ప్రవీణ్ ఆయనకు ఎదురేగి, "ఏమీ పరవాలేదు ప్రభూ! ఇది మేం చేసిందే. నగల మూట ఇదిగోండి!" అని రాణిగారి పరుపు క్రింద నున్న మూటను తీసి ఇచ్చారు రాజుగారికి.

రాజుగారు ఆశ్చర్యపోయారు. "ఇది ఇక్కడికి ఎట్లా వచ్చింది? మీకెలా దొరికింది?" అని ప్రశ్నలు కురిపించారు.

"ఏమీ లేదు ప్రభూ!ఈ పనిని రాణివాసంలో

పనిచేసే చెలికత్తెల్లోనే ఎవరో ఒకరు చేసి ఉంటారని మాకు అర్థమైంది. అట్లాగే నగలమూట ఈ కోటని దాటి పోలేదనీ అర్థమైంది. అందుకని దొంగ ఎవరో దాన్ని తీసి, ఈ చుట్టు ప్రక్కలే, ఎవరూ చూడ సాహసించని స్థలంలో, దాచి ఉంచిందని ఊహించాం. 'మంట' పేరుతో హడావిడి చేసేటప్పటికి, అందరూ బయటికి పారిపోతారు, కానీ దొంగ మటుకు తాను మూటని దాచిన తావుకు పరుగెడుతుంది- మేం ఇక్కడే ఉండి, రాణివాసంలో పనిచేసేవారినందరినీ గమనిస్తూ ఉన్నాం. అమాయకపు దొంగ పొగ మంటకు భయపడి తను దాచుకున్న మూటని మాకు చూపించేసింది!" నవ్వారు పిల్లలిద్దరూ.

రాజుగారు వాళ్ల తెలివిని మెచ్చుకొని, "ఇంతకీ దొంగలెవరో చూపనేలేదు మాకు" అన్నారు. "ఆ దొంగ ఇంకా ఇక్కడెందుకుంటుంది? పారిపోయింది మహారాజా! పోనివ్వండి, మళ్ళీ అయినా మనకు దొరక్కపోదు" అన్నాడు మహేష్.

రాజుగారు తన మాట ప్రకారం వాళ్లకు వంద బంగారు నాణాల్ని, ప్రశంసా పత్రాన్నీ అందజేసారు.



అదే రోజున, పిల్లలిద్దరూ ఇంకా ఊరికి బయలు దేరకనే వాళ్లకో ఉత్తరం అందింది: "ఇల్లలకగానే పండగ కాదు. మీ వంద బంగారు నాణాలను మీ ఊరికే వచ్చి దోచుకెళ్తాం. ఎవరు అడ్డుకుంటారో చూస్తాం" అని.

మహేష్, ప్రవీణ్ ఇద్దరూ గట్టిగా నవ్వారు. "మన ఊరికి రమ్మను..ఈసారి దొంగల్ని



అందరినీ పట్టించేద్దాం" అనుకున్నారు.

ఇద్దరూ తమ బహుమతిని పట్టుకొని ధైర్యంగా తమ ఊరికి వెళ్ళిపోయారు.

"ఆ దొంగలు ఎవరో మన ఊరుకు రావల్సిందే కదా, ఇవాల్టినుండి మన ఊరికి వచ్చే కొత్త మనుషుల్ని గుర్తు పెట్టుకుందాం మనం" అన్నాడు మహేష్.

పిల్లలిద్దరూ జాగ్రత్తగా గమనిస్తూ ఉన్నారు. మూడోరోజున ఆ ఊరికి కొందరు దృఢకాయులు వచ్చారు. "మన బంధువులు వీళ్ళే!" నవ్వాడు ప్రవీణ్. "ఊరికి కాపలా ఉండే సైనికులను హెచ్చరించాలి, వీళ్ళ గురించి!" అన్నాడు మహేష్.

ఆ రోజు రాత్రి ఊరిమధ్యలో ఉన్న మర్రిచెట్టు తొర్రలో దాక్కున్నారు వీళ్ళిద్దరూ. అర్థరాత్రి అవుతున్నదనగా దృఢకాయులు ఎక్కడినుండో బయటికి వచ్చి, మిత్రుల ఇళ్ళున్న వైపుకు నడవసాగారు. వాళ్లని ఆ తొర్రలో నుండి గమనిస్తున్నారు మిత్రులు..

దొంగలు మర్రిచెట్టు దగ్గరికి రాగానే తొర్రలోంచి "అహ్హాహ్హాహ్హా- ఆహాహ్హాహ్హాహ్హా" అని రాక్షసులలాగా నవ్వారు ఇద్దరూ. ఆ నవ్వులకు బిత్తరపోయిన దొంగలు "ఎవరది? ఎవరక్కడ? బయటికి వచ్చి ఎదురు నిలవండి! ఎవరది?!" అని అరిచారు బింకంగా.

తొర్రలోంచి మహేష్ మళ్ళీ ఓసారి నవ్వాడు. ప్రవీణ్ బొంగురు గొంతుతో "ఒరే! మేం ఈ ఊరిని కాపాడే రాక్షసులం! మాకు ఎదురు నిలుస్తార్రా మీరు! అహ్హహ్హహ్హహ్హ" అని నవ్వాడు. "రాజుగారినుండి ఆభరణాలతోబాటు మీరు డబ్బుల్నీ దోచుకున్నారు గదరా! ఆ డబ్బులు మొత్తం ఈ మర్రిచెట్టు ముందు పెట్టేసి చెంపలేసుకొని పోండి. లేదంటే మీ పని ఇవాల్టితో సరి!" అరిచాడు మహేష్. దొంగలు గడగడా వణికారు. తమ దగ్గరున్న మొత్తం డబ్బునూ మర్రిచెట్టు ముందు పెట్టి పారిపోబోయారు. అంతలోనే అందరూ కాపలా సైనికులకు దొరికిపోయారు. వాళ్లద్వారా అంత:పురపు దొంగ కూడా దొరికిపోయింది!

రాజుగారు మరోసారి పిల్లలిద్దరినీ సన్మానించారు! ★

రమేష్, మహేష్ ఒక ఇంటర్వ్యూకి వెళ్ళారు.

"ఇంటర్వ్యూకి నేనేమీ ప్రిపేర్ అవ్వలేదురా" అన్నాడు రమేష్. "ఏమీ పర్వాలేదు. నేను చెప్పిన సమాధానాలే నువ్వు కూడా చెప్పు" అన్నాడు మహేష్ లోనికి వెళ్తూ..

ఇంటర్వ్యూవర్: మన ప్రధానమంత్రి ఎవరు?

మహేష్: నరేంద్ర మోదీ

ఇంటర్వ్యూవర్: భూమి మీద కాకుండా ఇంకా ఏ గ్రహం మీదనైనా మనుషులు ఉన్నారా?

మహేష్: ఆ విషయమ్మై ఇంకా రిసెర్చ్ జరుగుతున్నది సార్.

తర్వాత రమేష్‌తో ఇంటర్వ్యూ మొదలైంది.

ఇంటర్వ్యూవర్: మొట్టమొదటి సారిగా చంద్రుని మీద కాలు మోపిన వారు ఎవరు?

రమేష్: నరేంద్ర మోదీ.

ఇంటర్వ్యూవర్: నీకేమైనా పిచ్చా!

రమేష్: ఆ విషయమ్మై ఇంకా రిసెర్చ్ జరుగుతున్నది సార్.



భద్రయ్య తోలుసంచి

సేకరణ: నేహా, పదవ తరగతి, ఇం.మీ శాంతినికేతన్ విద్యాలయ, జహీరాబాద్

పూర్వం చంద్రగిరిలో భద్రయ్య అనే వ్యాపారి ఉండేవాడు. చంద్రగిరి చుట్టుప్రక్కలే కాక, సుదూర ప్రాంతాలకు కూడా సరుకు తీసుకెళ్లి వ్యాపారం చేస్తూ బాగా సంపాదించాడు అతను. స్వభావ రీత్యా స్నేహశీలి, దయాశాలి అవ్వటంతో అందరూ భద్రయ్యని చాలా అభిమానించేవారు. సాటి వర్తకులు నష్టాల్లో ఉంటే వారిని ఆదుకోవటమే కాదు, సలహాలిచ్చి వ్యాపారానికి సాయపడుతూండేవాడతను.

ఇలా ఉండగా ఒకసారి ప్రక్కన చోళ దేశంలో సుగంధ ద్రవ్యాలకు కొరత ఏర్పడిందని,

మంచి గిరాకీ ఏర్పడిందని తెలిసింది అతనికి. దాంతో కావలసినంత సరుకు తీసుకొని, కొందరు పనివాళ్లను వెంటబెట్టుకొని చోళదేశం చేరుకున్నాడు.

సుగంధ ద్రవ్యాలకు అక్కడ నిజంగానే కొరత ఉంది. భద్రయ్యకు వ్యాపార చిట్కాలు బాగా తెలుసు. విశేష అనుభవం ఉంది. ఎక్కడ ఏ వస్తువులకు గిరాకీ ఉంటే అక్కడ ఆ వ్యాపారమే చేస్తాడు. ఆ విధంగా చోళదేశంలో అతడి సుగంధ ద్రవ్యాల వ్యాపారం ఎంతో లాభసాటిగా సాగింది. చేతిలో సరుకు మొత్తం అయిపోయింది. మరి కొంత సరుకుతో ఇంకోసారి చోళదేశం రావాలని నిశ్చయించుకొని, చంద్రగిరికి తిరుగు ప్రయాణమయ్యాడు.

అతనితోపాటు నలుగురు సేవకులు- అందరూ ఎడ్లబండ్ల మీద బయలుదేరారు.

చోళదేశంలో తను సంపాదించిన డబ్బునంతా బంగారు నాణాలుగా మార్చి, వాటిని ఒక తోలు సంచిలో వేసి, చక్కగా మూతికట్టి, తన దగ్గరే ఉంచుకున్నాడు భద్రయ్య. "ఎంత నమ్మకస్తుడికైనా ఎప్పుడు ఏ దుర్బుద్ధి పుడుతుందో" అని, "మనిషిని ప్రలోభ పెట్టే గుణం ధనానికి ఉంది" అని మళ్ళీ మళ్ళీ గుర్తు చేసుకునే భద్రయ్య, ఆ సంచిని మాత్రం తను నమ్మే సేవకుల చేతికి కూడా ఎప్పుడూ ఇవ్వడు.

కొంత దూరం వచ్చేసరికి వాళ్లకు పాపయ్య అనే తోటి వ్యాపారస్తుడు, అతని ఇద్దరు సేవకులు కలిసారు. చూసీ చూడగానే భద్రయ్య దగ్గర ఉన్న తోలు సంచిని పసిగట్టేసాడు పాపయ్య. దాన్నిండా బంగారు నాణాలు ఉన్నాయని కూడా అతనికి తెలిసిపోయింది! అతని బుద్ధి అసలు మంచిది కాదు. మంచిగా ఉంటూనే గోతులు త్రవ్వేస్తాడు. అయితే ఈ సంగతి భద్రయ్యకు తెలీదు. వ్యాపారి అంటే "వ్యాపారి కదా, మన ఊరివాడు" అనుకున్నాడు.

చీకటి పడే సమయానికి వాళ్లంతా సింహపురికి చేరుకున్నారు. ఆరోజు రాత్రికి ఒక సత్రంలో బసచేసారు. భోజనాలు చేసి

పడుకునేటప్పుడు పాపయ్య అడిగాడు: "వేకువజాముననే ప్రయాణం ఆరంభిద్దామా?" అని.

కానీ "ఇక్కడి నుండీ మొత్తం అడవి దారి కదా, చోర భయం ఉంది. ఏదో ఒక బిడారు గుంపు బయలుదేరే వరకూ ఆగటం మంచిది" అన్నాడు భద్రయ్య.

"తోలు సంచి కొట్టెయ్యాలంటే ఇదే అదను.. అవకాశం మళ్ళీ రాదు.. సంచీ తీసేసుకొని, వేకువనే వెళ్లిపోవాలి!" అని ఆ క్షణాన్నే నిశ్చయించుకున్న పాపయ్య, రాత్రికి రాత్రే ఆ తోలు సంచిని దొంగిలించాడు. తన మనుషులిద్దర్నీ నిద్రలేపి, చడీచప్పుడు కాకుండా బయలుదేరి వెళ్లిపోయాడు. మార్గామాసంతో గాఢ నిద్రలో ఉన్న భద్రయ్యకు ఆ సంగతి ఏదీ తెలీనే తెలీదు- తెల్లవారి చూస్తే ఏముంది? సంపాదన యావత్తూ దాచుకున్న తోలుసంచీ లేదు; ప్రక్కన పాపయ్య కూడా లేదు!

జరిగిన మోసం అర్థమైంది అతనికి. అయినా "ఆ సొమ్ము నాకు రాసి పెట్టి లేనట్టుంది.



అందుకే పోయింది!" అని సరిపుచ్చుకున్నాడు భద్రయ్య. తన దగ్గర ఇప్పుడు డబ్బు లేదు: కాబట్టి దొంగలు దోచుకుపోతారన్న భయం కూడా లేదు. అందుకని ఇక వెంటనే బండి కట్టుకొని, ప్రశాంతంగా చంద్రగిరికి ప్రయాణమయ్యాడు అతను.

సాయంకాలం అయ్యేసరికి ఎడ్లబండ్లు ఒక కొండవాగును చేరుకున్నాయి. విశ్రాంతి కోసం అక్కడ ఆగారు వాళ్ళు. అంతలో ఒక

బిడారు వాగుదాటి ఇవతలికి వచ్చింది.

బిడారు నాయకుడు వీరబాహుడు, గతంలో చాలా సార్లు భద్రయ్య బండ్లతో కలిసి ప్రయాణించాడు. భద్రయ్యను చూడగానే నవ్వుతూ దగ్గరకొచ్చాడు. "అయ్యా..చాలా రోజుల తర్వాత కనిపించారు- నమస్కారం" అన్నాడు.

"చోళదేశంలో వ్యాపార నిమిత్తం చాలా రోజులు ఉండిపోయాను. అందుకే కనబడలేదు! నువ్వు బాగున్నావా వీరబాహూ?" అంటూ పలకరించాడు భద్రయ్య.

"మేం బాగున్నామయ్యా. ఓసారి ఈ తోలు సంచీ చూడండి, తమదే అనుకుంటాను.." అంటూ తోలుసంచీ అందించాడు వీరబాహు.

ఆ సంచిని చూసి ఆశ్చర్యపోయాడు భద్రయ్య. అది తనదే!

"ఇది నాదే, వీరబాహూ! చోళదేశంలో చేసిన వ్యాపారం తాలూకు డబ్బు మొత్తం ఇందులోనే ఉంది. నిన్న రాత్రి సింహపురి సత్రంలో నిద్రపోతుంటే పాపయ్య అనే వ్యాపారి దీన్ని దొంగిలించుకొని పోయాడు-" అని ఆగి, "మరి ఇప్పుడు అది నీ చేతికి ఎట్లా వచ్చింది?" అని అడిగాడు.

"అయితే పాపయ్యకు తగిన శాస్తి జరిగిందిలెండి. మీకు గుర్తుందా? పోయిన సంవత్సరం మీరు నా బిడారుతోపాటు విజయనగరానికి వచ్చారు. ఆ సమయంలో మీరూ నేనూ కలిసి వెళ్ళి ఈ తోలు సంచిని కొన్నాం. అందుకే దీన్ని చూడగానే 'ఇది మీది' అని గుర్తించగలిగాను నేను. ఇవాళ్ళ మధ్యాహ్నంగా మాకు ఓ దొంగల గుంపు ఎదురైంది. వాళ్ళు పాపయ్య ఎద్దులబండి మీద దాడి చేస్తున్నారు. ఆ దాడిలో పాపయ్య చనిపోగా, పనివాళ్ళు ఇద్దరూ పారిపోయారు. అదే అదనుగా మేమూ ఆ దొంగలతో పోరాడి, వాళ్లందరినీ తుదముట్టించేసాం. "వాళ్ళ దగ్గర ఏమున్నది?" అని వెతుకుతుంటే ఈ సంచీ కనబడింది-.



'ఇది మీదే కదా, మీరు గానీ ఈ దొంగల పాల పడ్డారా?' అని నాకు దు:ఖం వేసింది. అందుకని మీకోసమే మేం మళ్ళీ ఈ వాగు దాటి, ఇటుగా వచ్చాం!" చెప్పాడు వీరబాహుడు.

తన క్షేమం గురించి అంతగా ఆలోచించిన వీరబాహుడికి ధన్యవాదాలు చెప్పాడు భద్రయ్య. "చూసావా?! పరుల సొమ్ముకు ఆశపడి ప్రాణాలు పోగొట్టుకున్నాడు పాపయ్య? అంతా మన మంచికే అని చెబుతారు. ఈ సంచీ నా దగ్గరే ఉంటే నేనే ఆ దొంగలకు బలై ఉండేవాడిని కదా!" అన్నాడు.

"అట్లా ఏమున్నది లెండి- మీకు ఏమీ అయిఉండేది కాదేమో, మీరూ నేనూ కలిసి దొంగలకు బుద్ధి చెప్పేవాళ్లమేమో, అసలు దొంగలే ఎదురయ్యేవాళ్ళు కారేమో, మరి ఇంకేమైనా జరిగి ఉండేదేమో" అని నవ్వాడు వీరబాహుడు. ★

ఇంటర్వ్యూ చేసే వ్యక్తి: మీరు మూడో ఫ్లోర్లో ఉన్నారని ఊహించుకోండి. అప్పుడు అకస్మాత్తుగా ఆ ఫ్లోర్ కు నిప్పంటుకుందనుకోండి. అక్కడినుంచి మీరు ఎలా తప్పించుకుంటారు?
అభ్యర్థి: ఏముంది? సింపుల్. నేనైతే ఊహించుకోవడం మానేస్తాను!

పొడుపు కథలకు జవాబులు: 1) చింతపండు 2) తాడిచెట్టు 3) సూది 4) మొగలి పువ్వు 5) మునగ కాయ 6) ముక్కు 7) దువ్వెన 8) మసిగుడ్డ 9) తేనెపట్టు 10) టెలిఫోన్ 11) ఆకాశం 12) ఆకాశంలో నక్షత్రాలు 13) అద్దం 14) వేరుశనగ కాయ



మానవత్వం

రచన: పి.అనిత, మదనపల్లి.

లింగాపురంలో నివసించే వెంకన్న కూలిపని చేసేవాడు; మూటలు మోసేవాడు. అతని కొడుకు హరిధర్ చాలా మంచి పిల్లవాడు. చదువులో చాలా చురుకు; చేతి పనుల్లోనూ గట్టివాడే. కూలి పనిలో కూడా తండ్రికి చేదోడు వాదోడుగా ఉండేవాడు.

హరిధర్‌కు ఒక స్నేహితుడు ఉన్నాడు. అతని పేరు శశిధర్. శశిధర్ వాళ్ళ నాన్న లక్ష్మీపతిగారు బాగా డబ్బున్న వ్యాపారవేత్త. సమాజంలో బాగా పేరున్న వ్యక్తి.

అంతస్తుల్లో తేడాలున్నా, పిల్లల మధ్యకు ఏనాడూ రాలేదు అవి. చదువులో శశిధర్ ఓ మోస్తరుగా ఉండేవాడు; ఎంత చదివినా పాఠాలు సరిగా అర్థమయ్యేవి కావు అతనికి.

అయినా శశిధర్‌కు ఏమీ బాధ లేదు- తనకు ఏది రాకపోయినా హరిధర్‌చేత మళ్ళీ మళ్ళీ చెప్పించుకునేవాడు. హరిధర్ కూడా 'నీకు ఎంత చెప్పినా ఎందుకు అర్థం కాదు?!' అని కోప్పడకుండా, శశిధర్‌కు రానివి అన్నీ చక్కగా తెలియజెప్పేవాడు.

ఒక రోజున లక్ష్మీపతి గారు మోటారుసైకిలు మీద పొరుగూరుకు వెళ్తూండగా అకస్మాత్తుగా దాని ముందు టైరు పంక్చరు అయింది. వాహనం అదుపు తప్పి రోడ్డు ప్రక్కన ఉన్న చెట్టుకొకదానికి గుద్దుకున్నది. లక్ష్మీపతిగారు వెంటనే స్పృహ తప్పారు.

సరిగ్గా ఆ ప్రక్క పొలంలోనే పని చేస్తున్నాడు వెంకన్న- ప్రమాదానికి గురైన లక్ష్మీపతిని చూసి గుర్తుపట్టాడు. గబగబా ఆయన్ని వైద్యశాలకు తీసుకెళ్ళాడు. "ఈయనకి రక్తం బాగా పోయింది. అర్జంటుగా రక్తం ఎక్కించాలి" అన్నారు డాక్టర్లు. వెంకన్న రక్తం గ్రూపు, ఆయన రక్తం గ్రూపు కూడా సరిపోయినై. ఏమాత్రం సంకోచించకుండా తన రక్తం ఇచ్చి ఆయన్ని కాపాడాడు వెంకన్న. కోలుకున్న లక్ష్మీపతిగారు "తనకు ప్రాణదానం చేసిన ఆ మంచి మనిషి వెంకన్న ఎవరు?" అని కొంచెం వెతికారుగానీ, ఆ సరికే వెంకన్న తన దారిన తాను వెళ్ళిపోయాడు. రెక్కాడితే కానీ డొక్కాడదు కద!

కొన్నాళ్ళకు శశిధర్ హరిధర్‌వాళ్ళ ఇంటికి వచ్చాడు. ఇద్దరూ కలిసి దగ్గర్లోని గుట్టలకు అవతల తామర పూలకోసం వెతుక్కుంటూ పోయారు. చక్కగా విచ్చుకున్న తామర పూలు, బురద మధ్యలో ఉన్నై. వాటిని అందుకుందామని ముందుకు పోబోయాడు శశిధర్..

అయితే అవి ఉన్నది ఒక ఊబిలో! ఆ ఊబిలో కాలు పెట్టిన శశిధర్ ఇక అందులో కూరుకుపోయేవాడే! అయితే ప్రక్కనే ఉన్న హరిధర్ సమయస్ఫూర్తితో ఆ దగ్గర్లోని గడ్డితోటే గబగబా ఓ తాడును పేని, శశిధర్‌కు అందేట్లు వేసాడు. చివరికి ఇద్దరూ 'బ్రతుకు జీవుడా' అంటూ శశిధర్ వాళ్ల ఇల్లు చేరుకున్నారు. మిత్రుడికి తను వేసుకునే

బట్టలు ఇచ్చి, భోజనానికి కూర్చోబెట్టాడు శశిధర్.



అంతలోనే లక్ష్మీపతిగారు అక్కడికి వచ్చి హరిధర్‌ని చూసి ముఖం చిట్లించారు: "శశిధర్! ఎవరీ పిల్లాడు? వీడికి నీ బట్టలు ఎందుకు ఇచ్చావు? ఇంట్లో లోపల భోజనానికి ఎందుకు కూర్చోబెట్టావు? మనం తినే ప్లేట్లు పెట్టావేమి? వీళ్ళది ఏ కులం? వీళ్ల నాన్న ఏం పని చేస్తాడు?" అని ప్రశ్నల మీద ప్రశ్నలు సంధించారు.

హరిధర్ చిన్నబోయాడు. "మేం ఇద్దరం ఒకే తరగతి సర్. ఇందాక వీడు, నేను ఏదో చిన్న ప్రమాదంలో చిక్కుకున్నాం. నా బట్టలకు బాగా మురికి అంటిందని వీడు తన బట్టలు ఇచ్చాడు. మా నాన్న వెంకన్న కూలి పని చేస్తాడు" అని చెప్పాడు భయం భయంగా.

"ప్రమాదమా?! ఏమైంది?" అని ఆదుర్దా పడిన లక్ష్మీపతిగారికి వీళ్ళు జరిగినదంతా చెప్పారు.

"అయినా పెద్దవాళ్ళు ఎవ్వరూ లేకుండా మీరు అట్లాంటి చోట్లకు వెళ్ళటం ఏమిటి?" అని అరిచిన లక్ష్మీపతిగారు "ఏంటో, మా రోజులు బాలేవు- మొన్నటికి మొన్న నాకు మోటారు సైకిలు యాక్సిడెంటు అయ్యింది. ఇవాళ్ళ వీడు ఇట్లా.." అన్నారు.

"అవునటండి- మా నాయన చెప్పాడు. ఆ రోజున మా నాయనేనట గదండి, మీకు రక్తం ఇచ్చింది?! ఇప్పుడు ఆరోగ్యం బాగున్నదాండి?" అడిగాడు హరిధర్ అమాయకంగా.

కంగారు, బాధ, కోపం అన్నీ కలిసిన ఆ క్షణాన లక్ష్మీపతిగారికి మానవత్వపు మొదటి పాఠాలు దొరికాయి: "కులాలు, మతాలు, గొప్ప-బీద తారతమ్యాలు ఇవన్నీ మనుషులు కల్పించుకున్నవి. ప్రకృతికి ఇవేవీ తెలియదు. అందరిలోనూ ప్రవహించేది రక్తమే. అందరిలోనూ ఉండేది మనసే. ప్రశ్నల్లా 'మానవత్వం ఎవరిలో ఎంత పాలు ఉన్నది?' అనేది! ఆ పరీక్షలో తమకంటే ఈ పిల్లాడి కుటుంబానికి ఎక్కువ మార్కులు వస్తాయి. వీళ్ళకు సంపద లేకపోవచ్చు. కానీ ఆ సంపదల్ని మించిన మానవత్వం కొల్లలుగా ఉన్నది! వీలైతే తామూ అలాంటి మానవత్వాన్ని అలవరచుకోవాలి! మనసులో కట్టుకున్న అడ్డుగోడల్ని పగలగొట్టుకోవాలి!" అని.

"బాగున్నది బాబూ! ఇప్పుడు చాలా బాగున్నది. నీనుండి, మీ నాన్న నుండి నేను నేర్చుకోవాల్సింది చాలా ఉన్నది. మీకు మేం ఏనాటికీ రుణపడి ఉన్నాం. అజ్ఞానం కొద్దీ నిన్ను ఏదేదో అన్నాను. నన్ను క్షమించు" అని ఏదేదో చెబుతూ కళ్ళనిండా నీళ్ళతో అక్కున చేర్చుకున్న లక్ష్మీపతిగారిని చూసి ఏమనాలో తెలీక అయోమయ పడ్డాడు హరిధర్.

ఏంటమ్మా ఇది? మీ కథల్లో దాదాపు ప్రతి పేరాలోనూ స్కూటర్ మలుపు తిరిగింది, కారు మలుపు తిరిగింది, అతను మలుపు తిరిగాడు లాంటి వాక్యాలు కనిపిస్తున్నాయి?" రచయిత్రి లక్ష్మితో అన్నాడు ఎడిటర్.

"అదేంటి సార్.... కథల్లో ఎన్నో మలుపులుండాలని మీరే కదా అన్నారు?" కళ్ళు విశాలం చేస్తూ అన్నది లక్ష్మి

నాకీ మధ్య నిద్ర సరిగ్గా పట్టడం లేదండీ" అన్నాడు రాజు, డాక్టర్‌తో.

"ఏదైనా గవర్నమెంటు ఉద్యోగం సంపాదించండి. మీసమస్య తీరుతుంది" చెప్పాడు డాక్టర్.



వ్యాపార రహస్యం

రచన:శ్రీ చొప్ప వీరభద్రప్ప, అనంతపురం.

చాలా కాలం క్రితం దక్షిణాపథంలో ప్రసన్నగుప్తుడనే వ్యాపారి ఉండేవాడు. వయసులో వున్నప్పుడు అతను సముద్రాల మీద దేశ దేశాలు తిరిగి వ్యాపారం చేసాడు. ఇప్పుడు ఇక వయస్సు మీద పడ్డాక, వ్యాపారాన్నంతా కొడుకులకు ఇద్దరికీ అప్పజెప్పి, తాను విశ్రాంతి తీసుకున్నాడు. ఎంత విశ్రాంతుడైనా పట్టణంలోని ముఖ్య వ్యాపారులతో పలకరింపుల్నీ, సంబంధాలను అట్లే కొనసాగిస్తూ ఉండేవాడు.

ఒకసారి ప్రసన్నగుప్తుడి కొడుకులు ఇద్దరూ రెండు ఓడలనిండా దాల్చిన చెక్క, ఏలకులు, లవంగాల వంటి సుగంధ ద్రవ్యాలను నింపుకొని, వ్యాపార నిమిత్తం

విదేశాలకు పయనమయ్యారు. తమ వద్దనున్న సరుకులను వివిధ దేశాలలో అమ్ముతూ, ఆయా దేశాలలో చవకగా దొరికే సరుకుల్ని తాము కొంటూ ముందుకు పోయారు. వ్యాపారం యావత్తూ చాలా లాభసాటిగా సాగింది. ఇట్లా రెండేళ్ళు గడిచేసరికి, స్వదేశానికి పోవాలనిపించింది వాళ్ళకు.



సరేనని మన దేశంలో అధిక ధరలకు అమ్ముడుపోయే యంత్ర సామగ్రులను, ఎంపిక చేసిన ఆహారోత్పత్తులను తమ రెండు ఓడలనిండా నింపుకున్నారు వాళ్ళు.

ఆ వ్యాపారులకు సగం డబ్బు చెల్లించి, తమ దేశంలో సరుకు దింపుకోగానే మిగతా సగండబ్బు చెల్లించేట్లు ఒప్పందాలు చేసుకున్నారు. అటుపైన, మరో ఓడను బాడుగకు తీసుకొని, దానిలో తాము ఈ రెండేళ్ల కాలంలోనూ సంపాదించిన బంగారు, వెండి ఆభరణాలను నింపుకొని, మెల్లగా మన దేశానికి పయనం కట్టారు.

రెండు నెలల పాటు వారి ప్రయాణం ఎలాంటి అడ్డంకులూ లేకుండా సాగింది. అయితే ఇంక కొద్ది రోజుల్లో మన దేశం చేరుతారనగా వాళ్ళు భయపడినంతా జరిగింది: భయంకరులైన సముద్రపు దొంగలు కొందరు నేరుగా ఆభరణాలు, బంగారం తెస్తున్న ఓడనే చుట్టు ముట్టారు! వ్యాపారులు సంపాదించిన సొమ్మునంతా దోచుకున్నారు! అదృష్ట వశాత్తు సరుకులు తెస్తున్న ఓడలు రెండూ వాళ్ల బారిన పడలేదు: సురక్షితంగా రేవు చేరాయి.

కుమారులు వచ్చినారనే సంతోషంతో ప్రసన్న గుప్తుడు రేవు దగ్గరే వాళ్లకు ఎదురేగాడు. క్షేమ సమాచారాలు అడుగుతూ ఓడపైకి చేరాడు. అయితే కుమారుల ముఖాలు

డస్సి, నీరసంగా ఉన్నాయి. ఉత్సాహం, సంతోషం కనబడలేదు. తెలివైన వ్యాపారికి అర్థమైంది: "దురదృష్టకరమైన సంఘటన ఏదో జరిగింది" అని. కొడుకులిద్దరూ కూడా తండ్రిని చేరి, ఏం జరిగిందో చెప్పేందుకు ప్రయత్నించారు. కానీ తండ్రి కనుసన్నలతోటే వాళ్ళని వారించాడు. సంతోషం నిండిన మొహంతో ఇద్దరినీ పలకరించాడు. పని వాళ్ళందరికీ గబగబా పనులు పురమాయించాక, ఓడదిగి వెళ్ళిపోయాడు.

కొడుకులిద్దరూ బిక్కమొహాలు వేసుకొని ఇల్లు చేరాక, వాళ్లను ప్రక్కకు పిలిచి, సంగతేంటో అడిగి కనుక్కున్నాడు. ఆపైన వాళ్లతో "నాయనలారా! మిమ్మల్ని చూడగానే ఏదో దుస్సంఘటన జరిగిందని నాకు అర్థమైంది. అయితే ఏ విషయమైనా సరే, మాట్లాడేందుకు సమయం, సందర్భం అనేవి ఉంటాయి. వాటిని పట్టించుకోకుండా తొందరపాటుతో చేసే పనులు నష్టాన్నే తెచ్చిపెడతాయి. చిత్తచాంచల్యం మనిషిని కృంగదీస్తుంది. అందువల్ల ఏం జరిగినా చిన్నపోరాదు- ప్రతి సమస్యనూ తెలివిగా, ఓర్పు నేర్పులతో పరిష్కరించుకోవాలి" అని చెప్పి, "సరుకు దింపుకోవడానికి మనకు ఎంత కాలముంది?" అని అడిగాడు.



"ఒక నెల సమయం ఉంది" అన్నారు వాళ్ళు.

"మేము ఆ సరుకు వెలలో సగం డబ్బు ముందుగానే చెల్లించాము. ఇక మిగతా సగం చెల్లించాలంటే ఇప్పుడు మా దగ్గర ఏమీ లేదు" అని చెప్పి తల దించుకున్నారు.

ప్రసన్నగుప్తుడు వాళ్లని ఓదారుస్తూ "ఏమీ

పర్లేదు నాయనలారా! ఇప్పుడు మనం ఇంకా చెల్లించాల్సిన మొత్తానికి సరిపడా సరుకులు ఓడలో ఉన్నాయి కదా?!" అని అడిగాడు.

"ఓఁ దానికేమీ ఢోకా లేదు. మనం చెల్లించాల్సినదానికి రెట్టింపు విలువ చేసే సరుకులు అందులో ఉన్నాయి. సమస్యల్లా మనం సరుకునంతటినీ ఈ కొద్ది రోజుల్లో ఎలా అమ్ముతాం అనేదే!" అన్నారు కొడుకులు.

"నేను అమ్మించి పెడతాను. మీరు నేను చెప్పినట్లు చేయండి చాలు" అని చెప్పి, తండ్రి అక్కడి నుండి బయటకు వచ్చాడు. కొద్ది సేపు ఆలోచన చేసాక, అతను పట్టణంలోకెల్లా ధనవంతుడైన వ్యాపారిని ఒకడిని తన ఇంటికి తేనీటి విందుకు ఆహ్వానించాడు. తన కుమారులు ఎన్నేళ్ళ పాటు ఏ ఏ దేశాలు తిరిగి వ్యాపారం చేసిందీ, ఎన్నెన్ని వింతలు చూసిందీ అద్భుతాలుగా వర్ణిస్తూ చెప్పాడు అతనికి.

ఆలోగా అతని కొడుకులు ఇద్దరూ రెండు పెట్టెలలో ఏవో సరుకులు ఉంచి, వాటి పైవరసలో మటుకు ఇంట్లో ఉన్న అభరణాలు పేర్చారు. అతిథికి కనబడేట్లుగా ఆజమాయిషీ చేస్తూ, ఆ రెండు పెట్టెలనూ నేలమాళిగలోకి తీసుకొని పోయారు. అతిథి దృష్టి వాళ్ళ మీదికి మరలటం చూసి ప్రసన్నగుప్తుడు నవ్వు ముఖంతో కొడుకుల్ని అడిగాడు "ఆభరణాల పెట్టెలు ఇంకా ఎన్ని ఉన్నాయి నాయనా?!" అని.



"ఇంకా ఎనిమిది ఉన్నాయి. వాటిని ఓడనుండి రేపు తెస్తామండి నాన్నగారు!" వినయంగా చెప్పారు కుమారులు.

వచ్చిన ధనవంతుడి ముఖం వికసించింది:

"సరుకు ఓడ నుండి దింపకనే ఇంత విలువైన వెండి, బంగారం వచ్చాయే, ఇంకా ఓడలు దిగని ఎనిమిది పెట్టెలలో ఎంత విలువైన ఆభరణాలు ఉన్నాయో!" అని ఉత్సాహపడి, అతను ఈ సంగతిని ఊళ్ళో అందరికీ చెప్పేందుకు త్వరత్వరగా పోయాడు.

"ప్రసన్నగుప్తుడి ఇంట్లోకి లెక్క లేనన్ని బంగారు రాసులు చేరుకున్నాయి" అన్న విషయం నగరమంతటా రెండురోజుల్లో వర్షమై కురిసింది; వాగై ప్రవహించింది. అందరూ అనుకున్నారు: "పట్టణంలో వాళ్లని మించిన ధనవంతులు లేరు" అని.

ఆ తర్వాతి రోజున కుమారులు తండ్రి చెప్పిన వ్యాపారుల ఇళ్ళకు వెళ్ళారు: "సరుకు దించిన వెంటనే ఒక్క వారం రోజుల్లో తిరిగి ఇచ్చేస్తాం; ప్రస్తుతానికి కొంత డబ్బు ఏమైనా సర్దుబాటు చేయగలరేమో చూడండి" అంటూ.


"ఇంత ధనవంతులు మనల్ని అడగటమే ఎక్కువ" అనుకొని, వాళ్ళంతా లేదనకుండా అడిగినంత ఇచ్చారు. చూస్తూండగానే సరుకులకు చెల్లించాల్సినంత డబ్బు జమ అయ్యింది. కొడుకులు ఆ డబ్బులు చెల్లించి సరుకు మొత్తం దించుకున్నారు.

మరుసటి రోజున "మా ఇంట్లో ఈ సరుకునంతా ఉంచుకునేందుకు స్థలం ఎక్కడుంది?!" అంటూ ఆ సరుకునంతటిని ఓడరేవులోనే తగిన రేటుకు అమ్మేసి, సొమ్ము చేసుకున్నారు పిల్లలు. "ఆలస్యమైతే సరుకు ఉండదట" అంటూ ఊళ్ళోని వ్యాపారులంతా రేవు దగ్గరే ఎగబడి సరుకునంతా కొనేసుకున్నారు! దాంతో ప్రసన్నగుప్తుడి కొడుకుల దగ్గర వాళ్ళు ఊహించినదానికంటే ఎక్కువ మొత్తం చేరింది.

వెంటనే తాము తీసుకున్న అప్పులన్నీ తీర్చేసారు వాళ్ళు! "మాట నిలబెట్టుకున్నారు" అని ఆ అప్పిచ్చిన వాళ్లందరికీ చాలా సంతోషమైంది.

ఊళ్ళో వ్యాపారులందరికీ ప్రసన్న గుప్తుడిమీద, అతని కుమారులమీద చాలా

గౌరవం ఏర్పడింది.



విదేశీ వ్యాపారం వల్ల కొడుకులకు ఏమంత మిగులుబాటు కాకున్నా, పట్టణంలో మటుకు తమ మీద నమ్మకం బాగా నిలిచిందని సంతోషించిన ప్రసన్నగుప్తుడు కుమారులతో అన్నాడు "నాయనలారా! ఇచ్చిన మాట పోతే, కొనుగోలుదారులకు వ్యాపారిపైన నమ్మకం పోతుంది.

అట్లాపోతే ఇక సమయానికి మనకు ఎవ్వరూ సహాయం చేయరు. 'నమ్మకం' అనేది డబ్బు కంటే విలువైనది. అంతేకాదు! ఒక్కోసారి మన రహస్యాలు బట్టబయలు చేయకుండా, సమయస్ఫూర్తితో గంభీరంగా ఉంటేనే మన పనులు సజావుగా సాగుతాయి. ఏ విషయానికైనా సంయమనం అవసరం"అని.

"తండ్రి ముసలివాడు, చేతగాని వాడు" అంటూ అతన్ని దూరం పెట్టాలనుకున్న కొడుకులు "ఈనాడు ఆయనే లేకుంటే మన గతి ఏమయ్యేది?" అని సిగ్గు పడ్డారు. వాళ్లకు ఆయన పట్ల గౌరవం పెరిగింది. అహంకారం తగ్గింది. పెద్దవాళ్ల జీవనానుభవం తమకు ఎంత అవసరమో అర్థమైంది.

నిన్న రాత్రి మహేష్ వాళ్ల ఇంట్లో దొంగలు పడ్డారు. డబ్బు, నగలు, విలువైన వస్తువులు అన్నీ ఎత్తుకెళ్లారు. కానీ టి.వి మాత్రం ఎత్తుకుపోలేదు ఎందుకని?

జవాబు: ఆ సమయంలో మహేష్ టి.వి చూస్తున్నాడు.



ప్రతిభ

రచన: జి మహేంద్ర, ఇంటర్మీడియట్, నాగసముద్రం, అనంతపురం జిల్లా.

నాగసముద్రంలో శ్రీధర్ అనే పిల్లవాడు ఒకడు ఉండేవాడు. వాడు చిన్నప్పట్నుంచి ఆటల్లోను, చదువుల్లోనూ అంతటా వెనకబడి ఉండేవాడు. కొంచెం మెల్లగా ఉండే అతన్ని తమతోబాటు ఆడనిచ్చేందుకు ఎవరికీ ఇష్టం ఉండేది కాదు. శ్రీధర్ కూడా వాళ్లని పట్టించుకునేవాడు కాదు. ఏమంత బాధపడేవాడు కాదు.

అయితే వాడు ఇంటి పనులు కూడా ఏమంత బాగా చేయలేకపోయేవాడు. దాంతో తల్లిదండ్రులు వాడిని ఎప్పుడూ 'చేతకానివాడా! ఎందుకురా, మాకు తప్ప పుట్టావు?! పనికిమాలిన వాడా!' అని తిడుతూ ఉండేవాళ్ళు. వాళ్ళ తిట్లు మటుకు శ్రీధర్‌ని బాగా కలవర పెట్టేవి. వాడు మరింత ముడుచుకుపోయేవాడు. ఎప్పుడూ, ఎవ్వరితోటీ కలవకుండా

ఒంటరిగా ఉండే శ్రీధర్‌ని అందరూ ఇంకా ఏడిపించేవాళ్ళు.

తొమ్మిదో తరగతి వరకూ ఎవ్వరినీ డిటెయిన్ చేయరు కదా, అట్లా శ్రీధర్ తొమ్మిదో తరగతికి వచ్చాడు. ఆ సంవత్సరం వాళ్ళకు క్రొత్త సైన్సు సార్ వచ్చారు.



ఒకరోజున ఆయన తన తరగతిలోని పిల్లలకు సైన్సు బొమ్మల పోటీ పెట్టారు. అందరూ మూడు నాలుగు బొమ్మలు గీయగా, శ్రీధర్ మాత్రం ఒకే బొమ్మ గీయగలిగాడు.

ఆ బొమ్మ కూడా నిజానికి ఏమంత బాగా రాలేదు. అయితే శ్రీధర్ మనసు పెట్టి గీసిన ఆ బొమ్మలో అతను పడిన కష్టం మటుకు స్పష్టంగా తెలుస్తూ ఉండింది. మిగిలిన పిల్లలు గీసిన బొమ్మల్ని తన ఎర్ర పెన్నుతో దిద్ది, సవరించి, బాలేదని తిట్టిన సైన్సు సార్ శ్రీధర్ బొమ్మని మటుకు చాలా మెచ్చుకున్నారు: "శ్రీధర్, నువ్వు చాలా బాగా గీశావు! నీకు ఏమీ రాదని, నీకేమీ చేతకాదని అనుకున్నాం. బొమ్మని నిజంగా చాలా చక్కగా గీశావు. నీ గీత చాలా సాఫీగా ఉంది. సాధన చేసావంటే మరింత చక్కని బొమ్మలు వేయగల్గుతావు! కీపిటప్!" అన్నారు.

అన్నేళ్ల చదువులో ఏనాడూ చిరునవ్వు కనబడని శ్రీధర్ ముఖంలో ఆరోజున మొదటిసారి చిరునవ్వు మెరిసింది.

తను గీసిన బొమ్మ ఏమంత బాగా లేదని శ్రీధర్‌కి తెలుసు. అయినా సార్ తనని తిట్టకపోవటం, పైగా మెచ్చుకోవటం వాడికి చాలా నచ్చింది. "నేను బొమ్మని అంత బాగా గీయకపోయినా సార్ నన్ను మెచ్చుకున్నాడే,

ఇక మరి నేను గనక బొమ్మని బాగా గీస్తే మరెంత మెచ్చుకుంటాడో!" అనే ఒక వింత స్ఫూర్తి ఒకటి శ్రీధర్‌లో కలిగింది.

ఆరోజు ఇంటికి రాగానే "నేను సైన్సు పుస్తకంలో ఉండే బొమ్మలన్నీ బాగా వేయాలి!" అని బొమ్మల ప్రాక్టీస్ మొదలుపెట్టాడు శ్రీధర్. వాడి ఉత్సాహాన్ని గమనించిన సైన్సు సార్ హోంవర్కులో భాగంగా ప్రతిరోజూ కనీసం ఒక బొమ్మనైనా గీయమనసాగారు . శ్రీధర్ ఆ బొమ్మతోబాటు మరిన్ని బొమ్మలు గీసుకొచ్చేవాడు. రాను రాను శ్రీధర్ బొమ్మలు చాలా ఇంప్రూవ్ అయ్యాయి. ఇప్పుడు శ్రీధర్ సమయాన్ని అస్సలు వృధా చేయట్లేదు. ఏ బొమ్మని చూస్తే దాన్ని నోటుపుస్తకాల్లోకి దించటం మొదలు పెట్టాడు. కొన్ని రోజులకు వాడి పుస్తకాలనిండా ఎక్కడ చూసినా బొమ్మలు కనిపించసాగాయి. మెల్లగా అతని చేతి రాత కూడా మారింది!

సైన్సు సార్ ఓసారి "ఇరవై సైన్సు బొమ్మల పోటీ" పెట్టారు. ఆ పోటీలో అందరికంటే చక్కగా బొమ్మలు గీసింది శ్రీధరే! అటుపైన తరగతిలో ఎవరికైనా చక్కని బొమ్మ కావల్సి వస్తే "శ్రీధర్‌ని అడుగుదాం" అనటం మొదలు పెట్టారు.



అంతవరకూ 'పనికి రానివాడు''ఏమీ చేతకానివాడు'గా ఉన్న శ్రీధర్ చాలా మంచిమార్కులతో పదో తరగతి పాస్ అయ్యాడు. బొమ్మలు గీయటంతో మొదలైన మలుపు అతని జీవితాన్ని పూర్తిగా మార్చివేసింది.

కాలేజీలో చేరిన తర్వాత శ్రీధర్ చిన్న చిన్నగా మనుషుల బొమ్మలు గీయడం సాధన చేశాడు. ఒక్కసారి మనిషి ముఖాన్ని చూస్తే

చాలు- బొమ్మ గీయగలిగేవాడతను!

అతనిలోని ప్రతిభను త్వరలోనే అందరూ గుర్తించారు. పెద్దయ్యేసరికి అతనొక గొప్ప చిత్రకారుడిగా పేరు పొందాడు.

తర్వాత చాలా ఏళ్ళకు సైన్సు సార్‌ని వెతుక్కుంటూ వెళ్ళాడు శ్రీధర్. సైన్సు సార్ అతన్ని నవ్వుతూ పలకరించారు. శ్రీధర్ చకచకా ఆయన బొమ్మని గీసి ఆయనకు బహుమానంగా ఇస్తూ అడిగాడు:

"సార్! అప్పట్లో నేను బొమ్మని ఏమంత బాగా వేయలేదు.. ఆ సంగతి నాకూ తెలుసు, మీకూ తెలుసు. అయినా మీరు నన్ను మెచ్చుకున్నారు. బొమ్మ బలే ఉందన్నారు- ఎందుకు?!" అని.

"పిల్లల్లో పనికిరానివాళ్లంటూ ఎవ్వరూ ఉండరురా. ప్రతి ఒక్కరిలోనూ వాళ్లదైన ప్రతిభ ఒకటి ఉంటుంది. పిల్లల్లో దాగిఉన్న సామర్థ్యాలని ఉపాధ్యాయుడు గుర్తించి, మెచ్చుకుంటే, పిల్లల్లోని ఆయా అంశాలు వికసించటం మొదలుపెడతాయి.

ఉపాధ్యాయుడు చేయాల్సింది నిరాశ-పరచటమూ, చిన్నబుచ్చటమూ కాదు- పిల్లలకు స్ఫూర్తినివ్వటమూ, వాళ్లలో ఉత్సాహాన్ని నింపటమూనూ. ఇంతకీ నేను నిన్ను మెచ్చుకోవటం వల్ల నీకు మేలు జరిగిందా, లేదా?!" అని నవ్వారు సైన్సు సార్.

ప్రతి ఒక్కరిలోనూ ఏదో ఒక ప్రతిభ ఉంటుంది. అది సమయాన్ని బట్టి బయటికి వస్తుంది. అందుకే ఎవరినీ తక్కువగా అంచనా వేయకూడదు.

పండు: మీ నాన్న అంటే మీ అమ్మకు ఎంత గౌరవం! మీ నాన్న తాగందే కాఫీ కూడా తాగట్లేదు.

బంటి: అది కాదురా! మా నాన్నకు షుగర్. ఆయనికిచ్చాక మా అమ్మ పంచదారు వేసుకొని తాగుతుంది.

జడ్జి: ఏమ్మా! నువ్వు కూడా నీ భర్తతో కలసి దొంగతనాలు చేస్తున్నావా?

ముద్దాయి: అవును సార్! ఈ కాలంలో ఒక్కరి సంపాదన మీద ఇల్లు ఎలా గడుస్తుంది!



స్వీయ అనుభవం

రచన: మద్దిరాల శ్రీనివాసులు, కంకణాల పల్లి, ప్రకాశం జిల్లా.

హరితపురం హైస్కూల్ లో ఆ రోజు ప్రార్థనా సమావేశం జరుగుతున్నది. హెడ్‌మాస్టర్ గారు మాట్లాడుతూ, "పిల్లలూ! ఈ రోజు పర్యావరణ దినోత్సవం. ఈ సందర్భంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు మనం పాఠశాల చుట్టూ మొక్కలు నాటాలి. నేటి మొక్కలే రేపటి చెట్లు. చెట్లు మనకు ప్రాణాధారం. చెట్లు లేకుంటే మనం లేము. చెట్లు మనకు అనేక విధాలుగా ఉపయోగపడుతున్నాయి. ఆ విషయం మీరు పుస్తకాలలో చదువుకొని ఉంటారు. మీ మీ తరగతి ఉపాధ్యాయులు మిమ్ములను గ్రూపులుగా విభజిస్తారు. ప్రతి

గ్రూపు కూడా ఒక మొక్కను దత్తత తీసుకోవాలి. కంచె వేసుకోవాలి. ప్రతిరోజూ క్రమం తప్పక నీరు పోస్తుండాలి. వాటిని నిరంతరం రక్షిస్తూ ఉండాలి. కంచెకు ఒకవైపు మీ గ్రూపు పేర్లతో ఒక అట్టముక్క కట్టండి. బాగా శ్రద్ధగా మొక్కను పెంచే గ్రూపుకు చక్కని బహుమతి కూడా ఉంటుంది" అంటూ ఆనాటి ప్రత్యేకతను తెలియజేసారు.

ప్రార్థన ముగిసింది. పిల్లలంతా తరగతి గదులలోకి వెళ్లారు. ఏడవ తరగతి లావణ్య తరగతి గదికి వెళ్లగానే, "గోవిందా! గోవిందా! ఈ రోజు బడిలో పాఠాలు గోవిందా!" అంది.

వెంటనే ప్రక్కనున్న అనిత, "ఏమైందే? ఏమిటా కేకలు?" అడిగింది.

"బడిలో మొక్కలు నాటాలన్నారుగా! హెచ్.ఎం.గారు!"

"అవును, చెట్ల వలన చాలా ఉపయోగాలున్నాయని చెప్పారు గదా!" అంది సుధ.

"ఉపయోగాలూ...? గాడిద గుడ్డేం కాదూ?!" చేతితో గుడ్డు ఆకారం చూపిస్తూ అంది లావణ్య.

లావణ్య ఆ ఊరి సర్పంచి గారి కూతురు. తెలివి గలదే. కానీ, తెలియనితనం ఎక్కువ. టీచర్లతో ఏదైనా ధైర్యంగా మాట్లాడుతుంది. ఇంట్లోవాళ్ళు రోజూ తనకు ఏదైనా కొనుక్కొమ్మని డబ్బులు ఇస్తుంటారు. అందుకే, తోటి అమ్మాయిలకు కాస్త చాక్లెట్ల లాంటివి ఇస్తూ ఉంటుంది; నాయకత్వ లక్షణాలు చూపిస్తూ ఉంటుంది. తరగతిలోని పిల్లలకు లావణ్య అంటే కాస్త భయం కూడా.

"మరీ...బడిలో చదువులు చెప్పకుండా ఇలాంటి పనులు ఏమిటో? బడికి మనకు చదువుకోవడానికి వస్తున్నామా? కూలి పనులు చేయడానికి వస్తున్నామా?" అంది లావణ్య.

"నువ్వు చెప్పేది నిజమే. కానీ, పని చేయకపోతే టీచరు అరుస్తుందేమో?" లక్ష్మి అడిగింది.

"హెడ్‌మాస్టర్ గారు కొడతారేమో?" మంగమ్మ సందేహం వెలిబుచ్చింది.

"ఎందుకు కొడతారు?" లావణ్య ధీమా వ్యక్తం చేసింది.

"ఏయ్! మాట వినకపోతే హెడ్‌మాస్టర్ గారు ఫైన్ వేస్తారు!" భార్గవి నిశ్చయం.

వీళ్లు మాట్లాడుకుంటుంటే మరి కొందరు- దుర్గ, రమ, భువనేశ్వరి, రమణి, సుధ- "ఏంటి? ఏంటి? ఏమంటున్నారు?" అంటూ గుమిగూడారు.

ఇంతలో క్లాస్ టీచరు సామ్రాజ్యం రావడం, అందరూ ఎవరి స్థలాల్లోకి వారు పరుగు తీసి గప్‌చుప్‌గా కూర్చోవటం జరిగాయి.

టీచర్ గారు విద్యార్థులందరినీ గ్రూపులుగా విభజించారు. తరువాత అందరినీ బయటికి తీసుకెళ్లి, ఎవరెవరు ఎక్కడెక్కడ మొక్కలు నాటవలసిందీ చూపించారు. లావణ్య, భార్గవి, దుర్గలకు ఒక మొక్క అప్పగించబడింది.

మూడు నెలల కాలం గడిచింది. గ్రూపులన్నీ మొక్కల పెంపకం బాగానే చేస్తున్నాయి. లావణ్య గ్రూపులో భార్గవి, దుర్గ ఇద్దరూ మొక్కను శ్రద్ధగా కాపాడుతున్నారు. లావణ్య మాత్రం ఇక ఆ సంగతే పట్టించుకోలేదు.

ఓ రోజు లావణ్య వాళ్లింటికి వాళ్ల అమ్మమ్మ వచ్చింది. లావణ్యకు అమ్మమ్మ అంటే చాలా ఇష్టం; కానీ అమ్మమ్మ ఊరు దుర్గంపల్లె అంటేనే కష్టం! ఆ ఊరికి వెళ్ళాలని ఉంటుంది తనకు. అయితే ఆ ఊరికి నేరుగా బస్సు లేదు. దేవాపురం వరకు మాత్రమే బస్సు. అక్కడి నుండి ఓ నాలుగు కి.మీ పైనే నడవాల్సి ఉంటుంది. అదీ సమస్య.

ఈసారి మాత్రం వాళ్ళ అమ్మమ్మ శుభవార్తతో వచ్చింది. "ఏమే? దుర్గంపల్లె వస్తావా? ఇప్పుడు కొత్తగా ఒక ఆర్టీసీ బస్సు వేశారు. ఇంక నువ్వు నడవక్కరలేదు" అంటూ.

"హాయ్! నిజంగానా అమ్మమ్మా?!" ఎగిరి గంతేసింది లావణ్య.

"అవునే! నీ కోసమే వేసినట్లున్నారు. మహారాణివి కదా!" అన్నది అమ్మమ్మ మురిపెంగా.

"అయితే నేను రెడీ!" అని గలగలా నవ్వుతూ, ఫ్రెండ్స్‌కి విషయం చెప్పేందుకు రయ్యున పరిగెత్తింది లావణ్య.

శనివారం ఉదయం ఎనిమిది గంటలకు హరితపురంలో బయలుదేరారు ఇద్దరూ. తొమ్మిదిన్నరకల్లా దేవాపురం చేరారు. పది గంటలు అవుతుండగా బస్సు వచ్చింది. సంతోషంతో గబగబా బస్సెక్కి కూర్చున్నారు. బస్సు కదిలింది గానీ, ఒక అర కిలోమీటరు వెళ్లగానే ఆగిపోయింది. డ్రైవరు, కండక్టరు పరిశీలించి, ఇక రిపేరు అవ్వడం కష్టమని తేల్చేశారు.

"అయ్యో! ఇప్పుడెలా?" అమ్మమ్మను అడిగింది లావణ్య.

"ఇంకేముంది నడవడమే!" ప్రక్కనున్న మరో ముసలావిడ సమాధానం.

"హు...హు...హు...అమ్మమ్మా!" అంటూ బుంగ మూతి పెట్టింది లావణ్య.

"ఏం చేద్దామమ్మా! మనం ఏమన్నా కలగన్నామా, ఇలాగవుతుందని? పద-పద!" అంటూ సీటు నుండి లేచి నడవసాగింది అమ్మమ్మ. లావణ్య ఇంకేం చేయగలదు?! ఏడ్చుకుంటూ నడక మొదలెట్టింది. దారిలో ఎక్కడా ఒక్క చెట్టు కూడా లేదు. ఆ రోజు సూర్యుడు తన ప్రతాపం కూడా బాగానే చూపించాడు.



దాంతో ఓ కిలోమీటరు నడిచే సరికి

లావణ్యకు తల తిరిగినట్లయింది. ఏడుపు వచ్చేసింది.

"ఇంకెంత! రెండు కిలోమీటర్లేగా?! మా అమ్మ కదూ...నడువమ్మా!" అని అమ్మమ్మ అంటుంటే, కాళ్ళు అరిగిపోతున్న లావణ్య అట్లా ఇట్లా ఇంకో కి.మీ. నడిచేసి కూలబడ్డది.

మనుమరాలి పరిస్థితి చూసిన దుర్గమ్మ, "అదిగో అక్కడ ఒక చెట్టు ఉంది. అక్కడ కాసేపు కూర్చుందాములే పద" అన్నది, ఆ పాప ప్రాణం లేచి వచ్చేట్లు.

అదో పెద్ద చింతచెట్టు.

"అబ్బ..ఎంత చల్లగా, హాయిగా ఉందో" అంటూ దాని క్రింద పడుకున్న లావణ్య తనను తానే మరచిపోయింది.

ఇంతలో ఆకలి గుర్తొచ్చింది. "అమ్మమ్మా!" ఆకలి!" అంది.

"ఇంకెంత! ఒక కిలోమీటరేగా! పద! ఇంటికి పోగానే అన్నం తిందువు గానీ!" అంది అమ్మమ్మ.

అక్కడున్న ఓ పెద్దాయనకు లావణ్యని చూసి జాలి వేసింది. చెట్టుపై నున్న చింతకాయలు కొని అందుకొని కోసి ఇచ్చాడు.

"వావ్!" అంటూ ఎంతో ఇష్టంగా తీసుకొని తినడం ప్రారంభించిన లావణ్య తనని తాను మరచిపోయింది.



"ఏయ్, లావీ! లావీ!" "ఇంక వెళదామా?" అని అమ్మమ్మ పిలిచేంతవరకూ ఈలోకంలో లేదు లావణ్య.

"ఏమైంది, ఎందుకు అలా అయ్యావు?"

అడిగింది అమ్మమ్మ.

బడిలో ఏం జరిగిందో చెప్పింది లావణ్య. "మా బడిలో మొక్కలు నాటమన్నారు అమ్మమ్మా! కానీ నేను 'అదేం పని- కూలి పని!' అనుకున్నాను. కానీ ఇవాళ ఆ చెట్టు క్రింద కూర్చున్నాం కదా, అప్పుడు తెలిసింది నాకు- ఆ హాయి ఎంత గొప్పదో, ఆ చెట్టు విలువ ఎంతో. నేను బాగా పొగరుమోతు నయ్యాను అమ్మమ్మా!" అన్నది లావణ్య, చిన్నబోతూ.

అమ్మమ్మ తనని ఊరడిస్తూ "దానిదేమున్నది, లావీ! మనం చేయాల్సిన పనుల్లోని మంచిని ఇప్పటినుండీ గుర్తిస్తే సరి! ఏ నాటికైనా స్వీయానుభవాన్ని మించింది లేదు. ఇప్పటికైనా మనం తెలుసుకున్నాం కద, అదే చాలు!" అన్నది.

హరితపురం రాగానే లావణ్య చురుకుగా మొక్కల పనిలో పాల్గొన సాగింది. తన మాట తీరు, నడవడిక అన్నీ మారాయి. ఆమెలో వచ్చిన చక్కని మార్పుకు స్నేహితులంతా చాలా ఆనందించారు.

ఒన్ మినిట్!

గురువుగారు: శిష్యా! నేను ఢిల్లీకి వెళ్ళాలి, రైలెంతకుందో ఫోన్ చేసి కనుక్కో!

శిష్యుడు: సరేనండీ. (స్టేషన్ కు ఫోన్ చేసి-) అయ్యా! ఢిల్లీకి రైలెంతకుందో చెప్తారా అండీ?

రైల్వే క్లర్కు: వన్ మినిట్ ప్లీజ్

శిష్యుడు: (మరుక్షణం, ఫోన్ పెట్టేసి గురువుగారి దగ్గరికెళ్ళి) వన్ మినిట్లో ఉందట స్వామీ!

గురువుగారు: ఆ!!!

పిల్లలకు మంచి నడవడిక నేర్పే అత్యుత్తమ మార్గం వాళ్లను సంతోషంగా ఉంచటమే!

- ఆస్కార్ వైల్డ్ (సేకరణ: యు. సుబ్బరాజు)



తగ్గిన కోపం

రచన :కుంచె చింతా లక్ష్మీ నారాయణ, ఎద్దులపల్లి, పామిడి మండలం, ఆనంతపురం జిల్లా.

వసంతకు తన దగ్గరున్న బొమ్మలంటే చాలా ఇష్టం. ఇప్పుడు వేసవికాలం కదా; బడి ఒంటి పూట మాత్రమే ఉంటుంది. ఇంట్లో ఆడుకునేందుకు పిల్లలందరికీ ఎంతో సమయం!

ప్రతిరోజూ వసంత పిల్లలందరినీ ఇంటికి పిలుచుకునేది. తనకున్న బొమ్మలు అన్నింటినీ కుప్పగా పోసేది. బొమ్మల్ని అందరికీ ఇచ్చి, తనతోబాటు- తన వద్దే- అడుకోమనేది. ఆ ఆటల్లో అందరూ తను చెప్పినట్లే ఆడాలి. ఎవరైనా తన మాట వినకపోతే- ఇక తన ఆట బొమ్మలు తను లాగేసుకునేది; కోపంగా తిట్టేది; ఆ పిల్లల్ని వాళ్ల ఇంటికి పంపేసేది.

ఒకరోజున వసంతతో ఆడుకునేందుకు వాళ్ళింటికి వచ్చారు సరళ, మరి కొందరు పిల్లలు. సరళ ఆడుకునేందుకు తన బార్బీ బొమ్మను ఇచ్చింది వసంత. పిల్లలందరికీ తలా ఒక బొమ్మా దొరికాయి. "అందరూ నాతో పాటు రండి! నేను గాలిపటం ఎంత

బాగా ఎగరేస్తానో చూడండి!" అన్నది వసంత. పిల్లలెవ్వరూ ఆ మాటల్ని పట్టించుకోలేదు. తమ దారిన తాము ఆడుకుంటూ ఉన్నారు. వసంతకు చాలా కోపం వచ్చింది. "మీరంతా మీ ఇళ్ళకు వెళ్ళిపోండి! ఎవ్వరూ ఇక్కడ ఉండనక్కర్లేదు!" అని అరిచింది.



అంతలోనే గాలి వేగంగా వీచసాగింది.

సుడిగాలి ఒకటి నేరుగా వీళ్ళున్న తావుకే వచ్చింది. వసంత చేతిలో ఉన్న గాలిపటం ఎగిరి పోతోంది.. "నా గాలిపటం! నా గాలిపటం!" అని అరుస్తూ దాని వెంట పడింది వసంత. ఏం జరుగుతోందో చూసిన సరళ, ఇంకా మిగిలిన పిల్లలు అందరూ వసంత వెంటపడ్డారు. అంతలో వసంత కాలికి ఒక రాయి తట్టుకున్నది. పైనున్న గాలిపటం వైపుకు చూస్తూ నడిచి, ఎదురుగా ఏమున్నదో చూసుకోలేదు ఆ పాప! పడటం పడటమే నేరుగా లోతైన బావిలో పడిపోయింది! వసంతకు యిత వచ్చు; అయినా పైకి వచ్చేందుకు ఆ బావికి మెట్లు లేవు!

పిల్లలంతా గొల్లుమన్నారు. ఏం చేయాలో ఎవరికీ పాలుపోలేదు. సమయస్ఫూర్తిగల సరళ అటు-ఇటు చూసింది. దగ్గర్లోనే మఱ్రి చెట్టు ఒకటి కనబడింది. "మర్రి ఊడలు తీసుకురండి!" అని అరిచింది. పిల్లలంతా ఊడలు తెంపుకొని వచ్చారు. "నీకేమీ కాదు వసంతా! ఈత కొడుతూ నీళ్ళమీద తేలుతూ ఉండు అంతే" అని వసంతకు ధైర్యం చెప్పి, "ఆ ఊడల్ని ఒక దానితో ఒకటి మెలి పెట్టి, తాడులాగా పేనండి!" అని పిల్లల్ని ఆదేశించింది సరళ. చూస్తూండగానే మెలిపెట్టిన ఊడలు పెద్ద మోకులాగా అయినాయి. ఆ మోకును పట్టుకొని అందరూ కలిసి బావిలోకి వదిలారు. సరళ

దాన్ని పట్టుకోగానే అందరూ కలిసి ఆమెను బయటికి లాగారు.



అపాయం నుండి బయటపడిన వసంత అందరికీ కృతజ్ఞతలు చెప్పింది.

"నేను అందరినీ కోపంతో తిడుతున్నా, ఇంతమంది నన్ను కాపాడడానికి వచ్చారు! మీకు నేనంటే ఎంత ఇష్టమో, స్నేహమంటే ఎంత గౌరవమో నాకు ఇప్పుడు అర్థమయ్యింది. ఇకమీద నేను ఎవ్వరిమీదా కోపగించుకోను. మంచి స్నేహితురాలయ్యేందుకు ప్రయత్నిస్తాను" అని చెప్పింది కళ్ళ నీళ్లతో.

"ఎలాంటి సమయంలోనైనా తలా ఒక చెయ్యి వేస్తే విజయం సాధించగలం. అందుకే స్నేహితులు అవసరం!" అని సరళ అన్నది.

అటుపైన వసంత "తనే గొప్ప" అనుకోవటం మాని, అందరితోటీ ప్రేమగా వ్యవహరించటం మొదలుపెట్టింది. వేసవి సెలవలు ఇక బలే సంతోషంగా గడిచాయి!

స్వాగతం!

కొత్తపల్లిలో పిల్లల రచనలకు ప్రాధాన్యత ఉంటుంది. ఈ పుస్తకంలో దాదాపు సగం కథలు పిల్లలు రాసినవి; మిగిలినవి పిల్లలకోసం పెద్దలు రాసినవి. బొమ్మలు వేసిన వాళ్ళు మటుకు యువకులు. పిల్లలను కలవటం, వాళ్లతో తెలుగులో కథలు రాయించటం, బొమ్మలు వేయించటం, వాళ్ళు పంపిన కథల్ని, బొమ్మల్ని సరిదిద్ది మిగతా పిల్లలందరికీ నచ్చేట్లు పుస్తకాలుగా తయారు చేయటం, దానికోసం ఓపెన్ సోర్సు ఉపకరణాలను వాడటం, కథల్ని అందరూ ఉచితంగా చదువుకునేట్లు ఇంటర్నెట్‌లో పెట్టటంతోపాటు, కొన్ని ప్రతులు అచ్చు వేయటం మాకు ఇష్టం. అందరి మేలూ కోరి చేసే ఈ పనిలో మీరూ పాలుపంచుకోండి. పిల్లల కథల ప్రపంచానికి స్వాగతం !



విలువైన రాళ్ళు

నేపాలీ జానపద కథ

కథనం: నారాయణ, కొత్తపల్లి బృందం

అనగా అనగా నేపాలును ఓ రాజు పరిపాలించేవాడు. అతని దగ్గర చాలా సంపద ఉండేది- అంటే ఎన్నెన్నో వజ్రాలు, వైఢూర్యాలు, కెంపులు, మరకతాలు, మాణిక్యాలు, ముత్యాలు- ఇంకా ఎంతో బంగారం ఉండేదన్నమాట. ఎవ్వరికీ లేనంత గొప్ప భవంతి ఒకటి ఉండేదిఆయనకి. ఆ భవనం కూడా భలే ఉండేది. ఎంతో అద్భుతంగా, పెద్ద పెద్ద శిల్పాలతో, చెప్పలేనంత అందంగా ఉండేది. రాజుగారు బంగారు పళ్ళాలలో భోంచేసేవాడు; వెండి గ్లాసుల్లో నీళ్ళు త్రాగేవాడు- త్రాగేసి, తన సంపద గురించి ఆలోచించుకునేవాడు.

ఒక్కోసారి, ఇంక వేరే పనేమీ లేదంటే, అట్లా నడచుకుంటూ తన ఖజానాకు వెళ్ళేవాడు. ఖజానా అంటే సంపదను దాచుకునే గది-

అందులో రాజుగారు తన దగ్గరున్న ప్రత్యేకమైన వజ్రాలను, ముఖ్యమైన వైఢూర్యాలను దాచుకునేవాడు. అవికూడాఎన్ని ఉండేవి అంటే, వాటి రాసులతో గది అంతా నిండిపోయి ఉండేది! చిన్న పిల్లలు ఇసుకతో ఆడుకున్నట్లు, ధగధగా మెరిసే ఆ వజ్రాలతోటి ఆడుకునేవాళ్ళు రాజుగారు . కెంపుల కుప్పలో పాదాలు దాచుకొని, వాటి మీద పగడాలను అమర్చి, 'ఎంత అందంగా ఉన్నాయి, ఇవి?' అని మురిసిపోయేవారు. కొంతసేపు అట్లా ఆడి అలసిపోయి, మరకతాల కుప్పను నెరిపి, మంచంలాగా చేసుకొని వాటి మీద పడుకొని నిద్రపోయేవారు. ఖజానాలో అట్లా గడిపినంత సేపూ రాజుగారికి సంతోషం ఇనుమడించేది. 'నేపాలుకెల్లా తనే గొప్ప రాజు'-అనిపించి, మనసంతా ఉల్లాసంతో నిండిపోయేది. తన ఖజానాలో ఎంత సేపు గడిపితే అంతసేపు మొలకనవ్వులు రువ్వుతూ ఉండేది రాజుగారి ముఖం. "బహుశః ప్రపంచంలో కెల్లా అత్యంత ధనికుడైన రాజును నేనే కావొచ్చు' అనే ఆలోచన వచ్చినప్పుడు ఆయనకు మరింత ఉల్లాసం కలిగేది.

ఒకరోజున ఆయన రాజ్యానికి ఒక రుషి వచ్చాడు. ఆయన మహాత్ముడని, జ్ఞాని అనీ అందరూ చెప్పుకుంటుంటే విన్నారు రాజుగారు. వినేసరికి, 'నేను కూడా ఆయన ఆశీస్సులు అందుకోవాలి' అనిపించింది ఆయనకు. వెంటనే బయలుదేరి రుషి బస చేసిన తోటలోకి వెళ్ళి, ఆయన దర్శనం చేసుకున్నాడు: 'మా మందిరానికి వచ్చి, కొన్నాళ్ళు ఉండండి, మమ్మల్ని ధన్యుడిని చేయండి' అని ప్రార్థించాడు. రుషి సరేనని, రాజుగారి భవనానికి బయలుదేరి వచ్చాడు.

రుషి గౌరవార్థం రాజుగారు ఆరోజు సాయంత్రం గొప్ప విందునొకదాన్ని ఏర్పాటు చేశారు. రుషి ప్రక్కన కూర్చొని, స్వయంగా వడ్డించారు. ఆయనకు తన సౌధాన్నంతా తిప్పి చూపించారు.

తనూ, తన రాణులూ ఉండేచోట ఆయనకు

బస ఏర్పాటు చేశారు.



అంతా అయ్యాక, ఏనాడూ ఎవ్వరికీ దక్కనంత గౌరవం రుషికి ఇవ్వాలనుకున్నారు- 'నా ఖజానాను చూపిస్తాను మీకు- రండి. మీరు అట్లాంటి సుందర దృశ్యాన్ని ఏనాడూ చూసి ఉండరు. ఈ దేశంలో ఎవ్వరి దగ్గరా లేనన్ని విలువైన మణులు, మాణిక్యాలు నా దగ్గర ఉన్నాయి- ఎన్నంటే, వాటి కుప్పలు ఖజానా పై కప్పుని అంటుకుంటుంటై. రండి, చూద్దురు!' అని వెంట తీసుకు వెళ్ళారు.

రాజుగారు రుషికి ఒక్కడికే అమూల్యమైన ఈ అవకాశం ఇచ్చింది- ఇంతవరకూ రాజుగారు తప్ప, మనిషన్నవాడెవ్వడూ అసలు ఖజానాలోకి అడుగే పెట్టి ఉండలేదు. రాజుగారు చాలా ఉత్సాహంగా ఉన్నారు- "నా ఖజానాని చూసి రుషి ఆశ్చర్యపోతాడు- అద్దిరిపోతాడు అసలు. బహుశ: ఆ సంతోషంలో ఆయన నాకు ఏవో చక్కని వరాలు, ఆశీర్వాదాలు కూడా ఇవ్వొచ్చు.. లేదా, దేశాన్ని చక్కగా పాలించటంలో మెళకువలు ఏమైనా ఒకటి రెండు చెప్పి వెళ్ళచ్చు.." అనుకుంటూ తన ఖజానా తలుపులు తెరచారు. రెండు చేతులూ బార చాపి రుషిని లోనికి స్వాగతించారు- "రండి, మహర్షీ! చూడండి! కళ్ళు మిరుమిట్లు గొలిపే ఈ సంపదను చూడండి. కప్పునంటే ఈ పగడాల కొండలు చూశారా, ఎంత ముద్దుగా ఉన్నాయో- ఇవి ప్రత్యేకంగా విదేశాలనుండి తెప్పించిన రత్నాలు..." అంటూ కొద్దిసేపు

మైమరచిపోయారు.

రుషి చకచకా ఖజానా అంతా కలయ తిరిగి చూశాడు. పెదవి విరుస్తూ- "ఇంతేనా, నీ సంపద?!" అన్నాడు.

రాజుగారు నివ్వెరపోయారు. "అదేంటి, ఇంతింత విలువైన రాళ్ళు మీ కళ్లముందు ఉంటే మీకు సంతోషమూ -ఆశ్చర్యమూ వేయట్లేదా స్వామీ, అట్లా అంటున్నారు?!" అన్నారు.

రుషి నవ్వాడు-"క్షమించాలి, రాజా! కానీ నాకు నీ ఈ రాళ్లకంటే విలువైన రాళ్ళు తెలుసు. వాటి విలువతో పోలిస్తే ఇవి అసలు రాళ్ళు కూడా కావు!" అన్నాడు.

ఇప్పుడు ఆశ్చర్యపోవటం రాజుగారి వంతు అయింది. ఆయనకు కొంచెం కోపం కూడావచ్చింది. "తన దగ్గరున్న వాటికంటే విలువైన రాళ్ళు వేరే ఎవరి దగ్గర ఉండి ఉంటాయి-" అన్నది ఆయన ఊహకే అందని విషయం!

"ఓహో! అట్లానా?! తమరు అనే ఆ విలువైన రాళ్ళేవో ఎక్కడ ఉన్నాయి?" వెటకారంగా అడిగాడాయన, రుషిని. తనకంటే ధనికులు అసలు ఎవరైనా ఉన్నారనే ఊహకే ఆయన నోరు చేదెక్కింది.

"రేపు ఉదయాన్నే చూపిస్తాను మీకు. ఇప్పుడిక నిద్రపోవలసిన సమయం అయ్యింది కదా?!" ఖజానాలోంచి నేరుగా పడకవైపుకు దారి తీశాడు రుషి.

ఆరోజు రాత్రి పరుపు మీద అటూ ఇటూ ఎంత దొర్లినా రాజుగారికి ఇక నిద్ర పట్టలేదు. 'అసలు నాకంటే ఎక్కువ విలువైన రాళ్ళను ఎవరైనా, ఎట్లా సంపాదించి ఉంటారు?' అని ఒకటే మథన పడ్డాడు. 'రుషి నిజమే చెప్తున్నాడంటావా? రేపు నిజంగానే చూపిస్తాడంటావా, ఆ రాళ్ళను?' అన్న ఆలోచనతో రాత్రంతా కునుకు లేదు. ఎంతకీ తెల్లవారలేదు కూడా! చివరికి, తెల్లవారు జాముననే రుషి దగ్గరకు వెళ్ళి "పదండి మరి! త్వరగా తయారవండి! మనం వెంటనే వెళ్ళి చూద్దాం ఆ రాళ్ళను!" అన్నాడు.

రుషి నవ్వాడు. అంతకంటే విలువైన రాళ్ళ గురించి విన్న తర్వాత రాజుగారిలో ఎంత మార్పు! ఎంత ఆత్రపడుతున్నాడు, వాటిని చూడాలని!

రాజుగారిని ఆయన భవంతిలోంచి బయటికి నడిపించాడు రుషి. ఇద్దరూ సన్నని ఓ బాట గుండానడచుకొని దగ్గర్లో ఉన్న గ్రామాన్నొకదాన్ని చేరుకున్నారు. రాజుగారి ఆత్రం మరింత ఎక్కువైంది- 'ఈ పల్లెటూర్లోనా? నా దగ్గరున్న మణులకంటే విలువైన రాళ్ళున్నాయా?' అనుమానిస్తూనే నడుస్తున్నారు. అక్కడ ఓ ఇంటి వాకిట్లో ఒకావిడ కూర్చొని ఉన్నది- తిరగలిలో ధాన్యం విసురుతున్నది. ఆవిడ ప్రక్కగా నిలబడ్డాడు రుషి- 'అవిగో- చూడండి. ఆ రాళ్లతో ఆవిడ ధాన్యం విసురుతోంది, చూశారా?' గుసగుసగా అన్నాడు విసురు రాయి వైపు చూపిస్తూ.

రాజుగారు తిరగలిని, రుషిని మార్చి మార్చి చూసి, విరగబడి నవ్వారు. "ఏం ప్రత్యేకత కనబడింది స్వామీ, మీకు, ఆ రాతిలో?! ఇట్లాంటి రాళ్ళు వందలు-వేలు ఉంటాయి. ఇది చాలా మామూలు తిరగలి రాయి.



దీనికి అసలు ఏమీ విలువే లేదు!" అన్నారు ఎగతాళి ధ్వనించే గొంతుతో. రుషి మూర్ఖత్వాన్ని తలచుకున్న కొద్దీ ఆయనకు నవ్వు ఆగటం లేదు: 'రత్నానికీ, తిరగలికీ తేడా తెలీని వాడు ఏమి రుషి?! ఇట్లాంటివాడికి తన ఖజానా విలువ

ఎందుకు తెలుస్తుంది?!'

రాజుగారు వెనుతిరిగి పోబోతుంటే రుషి ఆయన్ని వెనక్కి పిలిచాడు. "ఇటు రా, రాజా! ఇక్కడికొచ్చి ఈ రాయి ఏం చేస్తోందో జాగ్రత్తగా చూడు. ఒక రకంగా చూస్తే నువ్వన్నది నిజమే- దీనిలాంటి తిరగలి రాళ్ళు వందలు- వేలు ఉంటాయి. కానీ మరో విధంగా చూడు- నీ ఖజానాలో బందీలయి కూర్చున్న రాళ్లకంటే వాటి విలువే ఎక్కువ! ఈ తిరగలి రాయి ప్రతిరోజూ ఈమె తినేందుకు అవసరమయ్యేంత పిండిని ఇస్తున్నది- ఏరోజుకారోజు ఈమె కడుపు నిండేందుకు ఇది ఆధారం అవుతున్నది. మరి నీ రాళ్ళవల్ల ఏం ఉపయోగం కలుగుతున్నది?"

రాజుగారిలో ఆలోచన మొదలైంది.. 'నిజమే- తన రాళ్లతో నిజానికి ఎవ్వరూ ఏమీ చెయ్యలేరు! అవి ఎందుకూ పనికి రావు. ఎవరైనా కేవలం వాటిని చూడచ్చు; తాము ఎంత ధనవంతులో తలచుకొని గర్వపడచ్చు- అంతే'-

ఆయన ఆలోచనలు అర్థమయినట్లు, రుషి అన్నాడు- "ఇప్పుడు అర్థమయినట్లుంది, నీకు. నీ దగ్గరున్న రాళ్ళు ఎందుకూ పనికి రావు. ఇక్కడున్న రాళ్ళన్నిటిలోనూ ఈ తిరగలి రాయిని మించిన విలువైన రాయి అసలు లేనే లేదు. ఇది లేకపోతే ఈమె తన ధాన్యాన్ని విసురుకోనేలేదు; రోజూ రొట్టె తయారు చేసుకొని తిననూ లేదు. నీ ఖజానాలో ఉన్న రాళ్లన్నీ కలిసి కూడా చెయ్యని పనిని ఈ తిరగలి రాయి అవలీలగా చేస్తోంది- దీనికేం విలువ కడతావు?"

రాజుగారికి జ్ఞానోదయం అయింది. 'వస్తువుల అసలు విలువ వాటి ఉపయోగం వల్లనే' అని చెబుతున్న రుషికి తల ఒగ్గి నమస్కరించాడు.

తెలంగాణ ఉర్లగడ్డ ఫోన్ ఎత్తగానే ఏమంటుంది?	**"ఆలూ!" అంటుంది.**
ఒకే వెంట్రుక ఉండే హిందీ కవిని ఏమని పిలవచ్చు?-	**"ఇక్-బాల్" అంటే సరి!**


బొమ్మలు - పదాలు 6

రెండో తరగతి పిల్లలకు ప్రత్యేకం : *ఇక్కడ పది బొమ్మలున్నై. ఒక్కో బొమ్మనుండీ* ***రెండు-లేక-మూడు అక్షరాల పదాలు*** *తయారవుతాయి- చూడండి. వింత ఏంటంటే ఆ పది పదాలూ 'ఊ' తోటే మొదలౌతున్నై! బొమ్మల్ని చూసి పదాలు కనుక్కోండి మరి !*

నిర్వహణ : శ్రీమతి ఆదూరి హైమావతి, అమెరికా సంయుక్త రాష్ట్రాలు



1



2



3



4



5



6



7



8

2-3 తరగతుల పిల్లలకోసం బొమ్మలు-పదాల పోటీ:

కొత్తపల్లి 92 నుండి ఆరు సంచికలు వెనక్కి పోయి చూడండి. ప్రతి సంచికలోనూ "బొమ్మలు-పదాలు" చూడండి. మీ సమాధాలనన్నిటినీ వరసగా ఓ పోస్టుకార్డు మీద రాసి పంపండి.

అన్నీ సరిగా రాసిన 2-3 తరగతుల పిల్లల్లో ఇద్దరికి-చెరొక ఐదువందలు రూపాయలు బహుమతి!

మీ సమాధానంతో బాటు మీ పేరు, బడి పేరు, మీ అమ్మనాన్నల ఫోను నెంబరు తప్పక రాయండి.

గుర్తుంచుకోండి! యీా అవకాశం కేవలం రెండు-మూడు తరగతులలోని పిల్లలకు మాత్రమే!

పదరంగం-92

నిర్వహణ: డా. సిరి, మిర్యాలగూడ, నల్గొండ జిల్లా, తెలంగాణ రాష్ట్రం

1		★	2	3	4
	★	5			
★	6			★	
7			★	8	
9		★	10		
	★	11			

నిలువు

1. వినికిడికి ఉపయోగపడే శరీర భాగం (2)
2. అతి సూక్ష్మమైన పదార్థం (3)
3. తిరగబడిన 'గురు' (2)
4. పురుషులలో ఉత్తముడు (6)
5. 'స్నేహితుడు' ఇంకోలా (3)
6. వంద పద్యాలు! (3)
7. 'నాగలి'కి మరో పేరు (3)
8. బొర్రా గుహలు ఉన్న లోయ (3)
10. గ్రీష్మ ఋతువు తర్వాత వచ్చే ఋతువు (2)

అడ్డం

1. వృక్షానికి మరో పేరు (2)
2. 'అరువులు' ఏకవచనంలో (3)
5. చీకట్లో వెలుగులు చిందించే పురుగు (4)
6. 'మిత్రుడు' కి వ్యతిరేకపదం (3)
7. 'ఆమె'కి పులింగం (3)
8. భర్త తల్లి, భార్యకు ఏమవుతుంది? (2)
9. 'మారకం'లో మొదటి అక్షరం మాయం (2)
10. 'శాపము'కి వ్యతిరేకపదం(3)
11. 'రైతు' మరోలా (4)

అడ్డం-నిలువు ఆధారాల సహాయంతో ఈ గడులను నింపగలరేమో చూడండి. నింపిన పదరంగాన్ని, కేవలం పోస్టుకార్డుపై రాసి, మాకు అందేట్లు పంపండి. మీ బడి పేరు, తరగతి, మీవాళ్ల ఫోను నంబరు తప్పక రాయండి. సరైన సమాధానం రాసి ఎంపికైన ముగ్గురు పిల్లలకు కొత్తపల్లి - 94 ని బహుమతిగా పంపిస్తాం!

కొత్తపల్లి ప్రింటు పుస్తకాలను ఆన్‌లైన్లో ఆర్డరు చేయటం, చందాలు కట్టటం చాలా సులువు! క్రెడిట్ కార్డుల ద్వారాను, డెబిట్ కార్డుల ద్వారాను, నెట్ బ్యాంకింగ్ ద్వారా కూడా ఇప్పుడు కొత్తపల్లికై డబ్బులు చెల్లించవచ్చు! అక్కౌంటు నెంబర్లు వెతుక్కునే పని కూడా లేదు! సందర్శించండి: **http://www.instamojo.com/kottapalli**

కొత్తపల్లిని మీ మిత్రులకు, మీరు చదివిన బడులకు, మీ సమీపంలోని లైబ్రరీలకు బహూకరించండి!

రాబోయే 12 సంచికలకై ముందస్తు చందా:



వ్యక్తులకు: **300/-** (పోస్టేజీ మరియు యస్సెమ్మెస్ ఛార్జీలు కలిపి)

సంస్థలకు: **350/-**

గమనిక: అచ్చయిన పుస్తకాలు ఎప్పటికప్పుడు సాధారణ పోస్టులో పంపబడతాయి.

కొత్తపల్లి పుస్తకానికి చందా కట్టే **సంస్థ**ల వారు బ్యాంక్ అక్కౌంటులో జమ చేయాలని మనవి. ఆన్‌లైన్ చందా సౌకర్యం కేవలం వ్యక్తులకు మాత్రమే. సంస్థలకు: 350/- వ్యక్తులకు: 300/-

NEFT TRANSFER కోసం:

"Kottapalli Prachuranalu"
SB A/c 62320333310,
State Bank of Hyderabad
Dharmavaram Branch
IFSC: SBHY0020902

(బ్యాంకు వారి కొత్త నియమాలననుసరించి, "క్యాష్ హ్యాండ్లింగ్ చార్జీలు"గా ప్రతిసారీ రూ. 50 అదనంగా చెల్లించవలసి వస్తున్నది.. అందువల్ల బ్యాంకులో డబ్బు కట్టకండి- నేరుగా మీ అక్కౌంటు నుండే ట్రాన్సుఫర్ చేయగలరని ప్రార్థన)

ప్రస్తుతం అందుబాటులో ఉన్న కొత్తపల్లి ప్రింటు పుస్తకాల వివరాలు:

క్రమ సంఖ్య	వివరాలు	ఒక సెట్ లోని పుస్తకాల సంఖ్య	స్టాకులో ఉన్న సెట్లు (సుమారుగా)	వెల (రూ) **(పోస్టేజి రూ 50 అదనం)**
1	2011 Set	11	11	220
2	2012 Set	12	12	240
3	2013 Set	7	3	175
4	2014 Set	10	403	250
5	2015 Set	7	914	175
6	2016 Set	8	1178	200
7	2017 Set	4 (ప్రస్తుతం)	1500	100

మరిన్ని వివరాలకై సంప్రతించండి: కొత్తపల్లి ప్రచురణలు, 1-127/A, యంఆర్వో ఆఫీసు దగ్గర, చెన్నేకొత్తపల్లి, అనంతపురం జిల్లా, 515101. ఫోను: 7702877670, 9000453887. ఇ-మెయిలు : team@kottapalli.in

RNI Regn No. : APTEL/2014/62705 Date Of Publishing: 17/06/2017 Postal Regn No: HDP/008/2015-2017

చెట్లు నాటిన మనిషి

"ఇంతకీ ఈ ఎల్జియా బూఫియే గారు ఎవరు? ఆయన్ని కలవాలంటే ఎలాగ?" అడిగాడు సుబ్బారావు 'చెట్లునాటిన మనిషి' పుస్తకం చదివేసి. ఉద్వేగంతో అతని కళ్ళు చెమర్చి ఉన్నై.

నేను నవ్వా. "సూపర్ మ్యాన్ ఎవరు? స్పైడర్ మ్యాన్ ఎవరు? వాళ్ళనెలా కలవాలి?" అన్నా.

సుబ్బారావు దెబ్బతిన్నట్లు చూశాడు. " ఇది ఒట్టి కథేనా? నిజం కాదా? మరి ఇందులో చెప్పే లెక్కలు వగైరాలు అన్నీ అంత వాస్తవంగా ఉన్నాయే? నిజ జీవితంలో ఇట్లా చేసిన వాళ్ళెవరూ లేరా?" అన్నాడు నిరాశగా.

"ఈ కథ రాసిన జాఁ జియానో ఓసారి రోమన్ సామ్రాజ్య శిధిలాలు చూసేందుకు పోయాడట. అక్కడ అతనికి ఎదురైన ఓ గొర్రెల కాపరి, మళ్ళీ సంవత్సరం కల్లా తేనెటీగలు పెంచుతున్నాడట. ఆ మనిషి స్ఫూర్తిగా తను ఈ కథ రాసాడట. అంటే ఎల్జియా బూఫియే లాంటి వాళ్ళు ఉన్నట్లే కదా?" అన్నా.

"అవుననుకో.." అన్నాడు సుబ్బారావు, ఇంకా నిరాశగానే.

నేను చెప్పా- “చూడు- నిజానికి బూఫియే లాంటి వాళ్ళు చాలామందే ఉన్నారు. ఎవరికి వాళ్లు మౌనంగా, తాము చేసే పని తాము చేస్తూ పోతుంటారు. మొక్కలకు, చెట్లకు, నేలకు, పర్యావరణానికి, జంతువులకు, పిల్లలకు, పెద్దవాళ్లకు- అందరికీ మేలు జరిగేట్లు, తమకు ఇష్టమైన పనుల్ని తాము చేస్తూ పోతుంటారు. ఒక్కరే అట్లా నిరంతరంగా పని చేస్తూ పోతారు; గుర్తింపులకు, పొగడ్తలకు దూరంగా ఉంటారు. వాళ్లని ఎవ్వరూ ప్రత్యేకంగా గుర్తించటాన్ని ఇష్టపడరు. మామూలు వాళ్లలాగే, మనందరితో కలిసిపోయి ఉంటారు. అందుకని మనం జాగ్రత్తగా వెతికితే తప్ప, కనిపించరు" అని.

"అవునవును" అన్నాడు సుబ్బారావు, అటుగా పోతున్న ఓ రైతుకేసి పరీక్షగా చూస్తూ.

“Kottapalli” Printed and Published by Narayana Sarma on behalf of Kottapalli Prachuranalu and printed at Mudrica Offset Printers, Vijayawada and published at 1-127/A, Near MRO Office, Chennekothapalli, Ananthapuram District, AP-515101. Editor: Narayana Sarma.